తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం


రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..
తెలుగు-వెలుగు
మీకో చక్కని వేదికగా నిలుస్తోంది.
ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని
చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
97050 43131 | 8096660656

సంపుటి :03, సంచిక :70 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, గురువారం సెప్టెంబర్ 04, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

## 6న హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం

**హాజరవుతున్న హోంమంత్రి అమిత్ షా**



**హైదరాబాద్,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):** హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా రానున్నారు. మోజం జాహి మార్కెట్ వద్ద గణేశ్ విగ్రహాలకు స్వాగతం పలికి ప్రసంగిస్తారు. ఆరోజు మధ్యాహ్నం 1:10కి మిగతా2లో...

# ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు

## కాంగ్రెస్ అంటేనే పేదలపక్షం

**ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతను నెరవేరుస్తున్న పొంగులేటి**
**పదేళ్లుగా లేని రేషన్ కార్డులు ఇచ్చాం**
**పేదలందరికి సన్నబియ్యం సరఫరా**
**బిఆర్ఎస్ సచ్చిన పాము..దానిని మళ్లీమళ్లీ చంపడమెందుకు?**
**లక్షకోట్లను పంచుకోవడంలో కెసిఆర్ కుటుంబంలో కలహాలు**
**వారి పంచాయితీలో తలదూర్చే సమయంమాకెక్కడిది**
**ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంలో సిఎం రేవంత్ రెడ్డి**



**భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):** హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా.. ధరణి భూతం నుంచి రైతులకు విముక్తి కల్పించాలన్నా సమర్థుడైన మంత్రి కావాలని భావించా. అందుకే, పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గృహనిర్మాణ, రెవెన్యూ శాఖలు అప్పగించా. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి విజయవంతం చేశారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాటు చేసిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం దామరచర్లలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు.ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తామని గతంలో వైఎస్ఆర్ ప్రకటించారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్య 22 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్లలోకి పేదలు ప్రవేశించినప్పుడు మిగతా2లో...

# చట్టాలు చేసేది గవర్నర్లు కాదు

**అది రాష్ట్ర అసెంబ్లీల పరిధిలోనిది**
**సుప్రీంకోర్టులో రాష్ట్రాల వాదన**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):** చట్టాలు చేయడం అసెంబ్లీల పరిధిలోకి మాత్రమే వస్తుందని, ఆ ప్రక్రియలో గవర్నర్లకు ఎటువంటి పాత్ర ఉండదని రాష్ట్ర ప్రభుత్వాలు బుధవారం సుప్రీం కోర్టులో వాదించాయి. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియ చేసేందుకు గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించడంపై వివిధ రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయ మూర్తి(సీజేఐ) గవాయ్ నేతృత్వం లోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం ఏడవ రోజు మిగతా2లో...

# కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్

**ప్రజలకు దమ్మిడీ మేలు చేసేది కాదు**
**కాంగ్రెస్‌పై మరోమారు కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):** కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదని కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఊకంటి ప్రభాకర్ రావుతో పాటు– 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో చేరారు. దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడి లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవు. చిత్తశుద్ధి గల్ల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తది తప్ప సాకులు వెతకదు. ఈ సన్నాసులకు ప్రభుత్వం నడపడం చేతకాదు. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపడం.. పదవులు కాపాడుకోవాలనే సోయి తప్ప ఇంకోటి లేదు. చివరకు కేసీఆర్‌ను తిట్టాలి అదే వారి పని అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్‌లో తెలంగాణలో అప్పులు ఎంత అని ప్రశ్న వేసిండు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు, వదిలిపెట్టిపోయిన అప్పు మూడున్నర లక్షల కోట్లు– అని కేంద్రం చెప్పింది. అందులో కేసీఆర్ రాకంటే ముందు 72 వేల కోట్ల అప్పు ఉంది. ఆయన వచ్చిన తర్వాత 2 లక్షల 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఇది మాత్రమే అప్పు అంటూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పింది. అయినా మిగతా2లో...

## భారత్ సుంకాలతో చంపేస్తోందట..

**- ట్రంప్ నోట జూటా మాట..!**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల విషయంలో అసత్యపు వ్యాఖ్యలు చేశారు. రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టినప్పటి నుంచి పలు దేశాలపై సుంకాల భారం మోపుతూ బెదిరింపులకు పాల్పడుతున్న ట్రంప్.. భారత్ తమను మిగతా2లో...

# బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు

**రేపు కెటిఆర్‌కు కూడా ఇలాంటి గతే పడుతుంది**
**నన్ను బయటకు పంపేందుకు ఎప్పటినుంచో ప్లాన్లు**
**కెసిఆర్ ఇది గుర్తించి ముందుకు సాగాలి**
**గుంటనక్కలు హరీష్, సంతోష్‌ల పట్ల జాగ్రత్త**
**రేవంత్‌తో కుమ్మక్కయిన హరీష్**
**మీడియా సమావేశంలో కవిత సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):** బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు గుంట నక్కల్లా చుట్టూ చేరిన హరీష్ రావు, సంతోష్ రావులతో జాగ్రత్త అంటూ కెసిఆర్ తనయ కవిత హెచ్చరించారు. అధికారంలో ఉండగా అడ్డగోలుగా సంపాదించుకున్న వీరు ఇప్పుడు మీకు కూడా ఎసరు పెట్టే పనిలో ఉన్నారు.. తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అన్నా రామన్నా నీవు కూడా వరితో జాగ్రత్త అంటూ హెచ్చరికలు చేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపడానికి కారణమైన వీరు మన కుటుంబం విచ్ఛిన్నం కావాలని పన్నాగం మిగతా2లో...

## నేను ప్రజల వెనకే ఉన్నా...

**- నేనెవరి వెనకా లేనన్న సిఎం రేవంత్**



2లో

## కాళేశ్వరం అవినీతిపై కావాలనే కాలయాపన

**ఫోన్ ట్యాపింగంపై ఎందుకు అడగడం లేదు**
**మీడియాతో మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):**కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులు వచ్చాక కూడా కాలయాపన చేశారని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. మరి ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత భారత రాష్ట్ర సమితికి రాజీనామా మిగతా2లో...

## విదేశాల నుంచి ఆగిన యూరియా దిగుమతులు

**కొరత అందుకేనని వెల్లడించిన కేంద్రం**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**



**న్యూఢిల్లీ,3(తెలుగు-వెలుగు):** యుద్ధాల కారణంగా కేంద్రం ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోలేదని, అందు వల్లనే కొరత ఏర్పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో యూరియా సరైన సమయంలో మిగతా2లో...

# భగ్గుమంటున్న బంగారం ధరలు

## - లక్షా పదివేల దిశగా పరుగులు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్3(తెలుగు-వెలుగు):** బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. గత 10 రోజులుగా పెరుగుతూ వస్తున్న గోల్డ్ రేట్స్.. ఎప్పుడూ లేని విధంగా కొత్త గరిష్ఠాన్ని తాకాయి. బుధవారం బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,06,970గా.. 22 క్యారెట్ల ధర రూ.98,050గా ట్రేడ్ అవుతోంది. ఈరోజు 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.880.. 22 క్యారెట్ బంగారం రూ.800 పెరిగింది. ఈ 10 రోజుల్లోనే ఏకంగా 5 వేలకు పైగా పెరగడం విశేషం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బంగారం లక్షా పది వేల రూపాయల చేరువకు వచ్చేసింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర మిగతా2లో...

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

## 6న హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో భేటీ-కానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నట్లు- పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 నుంచి 3:30 వరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 46 ఏళ్ల ప్రయాణంపై ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర హోంమంత్రి ప్రారంభించి..కమిటీ- సభ్యులతో గ్రూప్ ఫోటో దిగనున్నారు. 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్ఎస్‌బీ 28వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఐటీసీ కాకతీయ నుంచి సాయంత్రం 4 గంటలకు మెజాంజాహీ మార్కెట్ వినాయక చౌక్‌కు చేరుకుని గణనాథులకు స్వాగ తం పలకడంతో పాటు- గణేష్ శోభాయాత్రను ఉద్దేశించి ప్రసంగిస్తారని భాజపా వర్గాలు తెలిపాయి.

## చట్టాలు చేసేది గవర్నర్లు కాదు

(మొదటి పేజీ తరువాయి)

విచారణ కొనసాగించింది. ధర్మాసనం పశ్చిమ బెంగాల్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాల వాదనలు ఆలకించింది. బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో పెట్టే విచక్షణాధికారం గవర్నర్లకు ఉండడాన్ని ఈ రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పశ్చిమ బెంగాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు తప్పనిసరిగా సంతకం చేయాలని చెప్పారు. అసెంబ్లీ ఆమోదించిన చట్టం రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉంటే కేంద్రం ఆ చట్టాన్ని రద్దు చేయవచ్చని లేదా కోర్టులో సవాలు చేయవచ్చని ఆయన తెలిపారు. కాని ప్రజాభీష్టాన్ని గవర్నర్ అడ్డుకోలేరని ఆయన స్పష్టం చేశారు. తన వ్యక్తిగత సంతృప్తి ఆధారంగా గవర్నర్లు బిల్లులను పెండింగ్‌లో పెట్టడానికి అనుమతిస్తున్నట్లు ఆర్టికల్ 200లో ఏ నిబంధన చెప్పలేదని ఆయన వాదించారు.బిల్లులను గవర్నర్లు అడ్డుకోవడం వల్ల కేంద్రం-రాష్ట్ర మధ్య ఘర్షణలను పెంచుతుందని, ప్రజాస్వామ్యానికి ఇది ముప్పుగా పరిణమించగలదని హిమాచల్ ప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ఆనంద్ శర్మ హెచ్చరించారు. కర్ణాటక తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ రాష్ట్రాలలో రెండు ప్రభుత్వ వ్యవస్థలు ఉండరాదని వాదించారు. రెండు రాజ్యాంగపరమైన పరిస్థితులలో తప్పించి గవర్నర్లు రాష్ట్ర మంత్రిమండలి సూచన మేరకు పనిచేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. కాగా, అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు నిరవధికంగా పెండింగ్‌లో ఉంచలేరని ధర్మాసనం నిర్ద్వంద్వంగా తెలిపింది.

## భారత్ సుంకాలతో చంపేస్తోందట..

(మొదటి పేజీ తరువాయి)

సుంకాలతో చంపేస్తోందని విచిత్ర వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా చైనా, బ్రెజిల్ కూడా తమను సుంకాలతో చంపుతున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ తీరు 'దొంగే.. దొంగా దొంగా..' అని అరిచినట్టుగా ఉంది.తాజాగా స్కాట్ జెన్నింగ్స్ రేడియో షో ఇంటర్వ్యూలో మాట్లాడిన ట్రంప్.. తమ వస్తువులపై ఆయా దేశాలు అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నాయని విమర్శించారు. భారత్ సుంకాలతో తమని చంపేస్తోందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అమెరికా వస్తువులపై సుంకాలు ఉండవని ఢిల్లీ అంగీకరించిందని చెప్పారు. భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించడాన్ని ఆయన మరోసారి సమర్థించుకున్నారు.ట్రంప్ ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'మాపై పలు దేశాలు సుంకాలు విధించాయి. చైనా సుంకాలతో చంపేస్తోంది. సుంకాలతో భారత్ కూడా మమ్మల్ని చంపుతోంది. బ్రెజిల్ కూడా భారీ సుంకాలు విధిస్తోంది. అందరికంటే ఎక్కువగా సుంకాల గురించి అర్థం చేసుకున్నా. నేను చేపట్టిన చర్యలతోనే ఆయా దేశాలు దిగివస్తున్నాయి. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్. తమ వస్తువులపై సుంకాలు ఉండవని వాళ్లు నాకు చెప్పారు. నేను ఈ చర్యలు తీసుకోకుండా ఉంటే వాళ్లు దిగివచ్చేవారు కాదు. అందుకే సుంకాలు ఉండాలి. ఆర్థికంగా మరింత బలపడతాం' అన్నారు.అదేవిధంగా అనేక దేశాలపై అమెరికా విధిస్తున్న టారిఫ్‌లు అక్రమమని ఓ ఫెడరల్ అప్పీల్ న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలపై కూడా ట్రంప్ స్పందించారు. ఆ కేసును ఇతర దేశాలు స్పాన్సర్ చేస్తున్నాయని ఆరోపించారు.

## నేను ప్రజల వెనకే ఉన్నా... నేనెవరి వెనకా లేనన్న సిఎం రేవంత్

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 03:** భారత రాష్ట్ర సమితి నేతలను ప్రజలు తిరస్కరించారని, అలాంటి వారి వెనుక తాను ఎందుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారి రాజకీయ లబ్ది కోసం తనను వాడుకుంటానని అంటే ఎలా అని అన్నారు. బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు-చేసిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్‌రావు వెనుకాల రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలపై సీఎం తాజాగా స్పందించారు. నేను కవిత వెనుకున్నానని కొందరు అంటు-న్నారు. హరీశ్‌రావు, సంతోష్ వెనుక ఉన్నానని మరికొందరు అంటున్నారు. నేను ఎవరి వెనుకా లేను. ఇప్పటికే ప్రజలు వాళ్లను తిరస్కరించారు. అలాంటి వారితో కలిసే సమయం నాకు లేదు. ప్రజల వెంట మాత్రమే ఉంటాను. మీ కుల, కుటుంబ పంచాయితీల మధ్య మమ్మల్ని తీసుకురావొద్దని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ఒకప్పుడు జనతా పార్టీ చాలా ఫేమస్.. కాల గర్భంలో కలిసిపోయిందని గుర్తు చేశారు. ఏ పార్టీ, ఎవరు శాశ్వతం కాదుని హితవు పలికారు. పాపం ఎప్పుడూ ఊరికే పోదని నొక్కిచెప్పారు.

## కాళేశ్వరం అవినీతిపై కావాలనే కాలయాపన

(మొదటి పేజీ తరువాయి)

చేస్తే ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే కవిత అంశం ముందుకు వచ్చిందన్నారు. కాళేశ్వరం, గొర్రెలు, బర్రెల కుంభకోణంపై చర్చ జరగాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై సీబీఐ వేయాలని తొలుత డిమాండ్ చేసింది తామేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. అయితే తమ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల కాలయాపన చేశారని మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా సీబీఐ విచారణ ఎలా చేస్తుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కమిషన్ రిపోర్ట్ బీఆర్ఎస్ చేతిలో పెట్టి.. సీబీఐతో విచారణా అని ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ బీఆర్ఎస్‌కు ఇచ్చి.. దొంగ చేతికి సీఎం రేవంత్ రెడ్డి తాళాలు ఇచ్చారంటూ ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బిడ్డ కవిత చెప్పిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ గుర్తు చేశారు. కవితను సస్పెండ్ చేస్తే ఎం? చేయకపోతే ఎం? అంటూ అభిప్రాయ పడ్డారు. పార్టీ అంతర్గత వ్యవహారాన్ని కావాలనే బయటకు తెచ్చారని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం అవినీతిని డైవర్ట్ చేయడానికే.. తెరపైకి కవిత అంశం తీసుకు వచ్చారని కేంద్ర మంత్రి సంజయ్ విశ్లేషించారు.కవిత ఎపిసోడ్‌తో తెలంగాణకు ఏమైనాలాభంఉందా? అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు.

## నాంపల్లి కోర్టుకు నాగార్జున

**హైదరాబాద్,సెప్టెంబర్3:** హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు సినీ నటు-డు అక్కినేని నాగార్జున, అక్కినేని నాగ చైతన్య హాజరయ్యారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై న్యాయమూర్తి ఎదుట నాగార్జున, చైతన్య స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం నాగార్జున మీడియాతో మాట్లాడుతూ తాను వేసిన పరువునష్టం దావా కేసులో కోర్టుకు హాజరైనట్లు- తెలిపారు. న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతోందన్నారు.

## బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

పన్నా రని అన్నారు. బిఆర్ఎస్‌లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరా బాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గురం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబం బాగుండొద్దు.. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీ-ఆర్)కు, మీకూ పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారని కవిత వ్యాఖ్యానించారు. అక్రమ కేసులు పెట్టి తిహార్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. గురుకులాలు, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేశామన్నారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినపుడు గళమెత్తినట్లు- చెప్పారు. బనకచర్ల, భద్రాచలం సమీపంలోని ముంపు గ్రామాల అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు- కవిత తెలిపారు. సీఎం సొంత జిల్లాలో భూనిర్వాసితులకు అండగా ఉన్నామని చెప్పారు. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలుపుకొని.. గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడామన్నారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలన్నారు. తనపై ఎలా కుట్రలు సాగించారో సోదాహరణంగా వివరించారు. నేను రామన్నను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని.. నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేయరా అన్నా? నేను కూర్చొని ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా.. నాకైతే అనుమానమే. హరీశ్‌రావు, సంతోష్ గురించి ఆలోచించాలని కేసీఆర్‌కు బిడ్డగా చెబుతున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచీ హరీశ్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్న అంటూ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారా? లేదా? చెప్పాలి. సంతోష్, హరీశ్‌రావు గ్యాంగ్‌లు భారత రాష్ట్ర సమితికి పట్టిన జలగలని కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. కాళేశ్వరంలో అవినీతికి హరీష్ రావే కారణమన్నారు. తుమ్మడిహట్టి నుంచి మార్చిందే హరీష్ రావని అన్నారు. హరీష్ రావు మీద ఆరోపణలు వచ్చిన పాల సరఫరా, ఫామ్ హౌజ్ గురించి మరుసటి రోజే మాయం అయ్యాయని అన్నారు. ఆనో ట్రబుల్ షూటర్ కాదు...ట్రబుల్ క్రియేటర్ అని ఘాటు విమర్శలు చేశారు. మెగా కాంట్రాక్టర్‌తో పోచంపల్లి మోకిల్లాలో 750 కోట్ల విల్లా ప్రాజెక్టులు చేపట్టారని అన్నారు. ఇవన్ఈన గుర్తించి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఈ ఇద్దరిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పార్టీకి కూడా ఇదో హెచ్చరిక అన్నారు.

## భగ్గుమంటున్న బంగారం ధరలు



(మొదటి పేజీ తరువాయి)

రూ.1,06,970గా.. 22 క్యారెట్ల ధర రూ.98,050గా కొనసాగుతోంది. విశాఖ, విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.1,07,120గా.. 22 క్యారెట్ ధర రూ.98,200గా ట్రేడ్ అవుతోంది. ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు కంగారుపడి పోతున్నారు. ఇక దీపావళి నాటికి బంగారం ధరలు ఎలా ఉంటాయో అని -టె-న్షన్ పడుతున్నారు.మరోవైపు వెండి ధర కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. గత ఐదు రోజులుగా వెండి పెడుతోంది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై ఈరోజు రూ.900 పెరిగి.. రూ.1,27,000గా నమోదైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి లక్షా 37 వేలుగా ఉంది. బుధవారం ఉదయం 10 గంటల వరకు గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్లో నమోదైన గోల్డ్, సిల్వర్ ధరలు ఇవి. ప్రాంతాల వారీగా ధరల్లో మార్పులు ఉంటాయన్న విషయం తెలిసిందే.

## ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే ఆనందం వెలకట్టలేనిది. పేదల కష్టాలు మాకు తెలుసు కాబట్టే .. పేదరికాన్ని రూపుమాపాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్ర ప్రజలకు పదేళ్లపాటు-.. కొత్త రేషన్ కార్డులు అంటే ఏంటో తెలియదు. మా ప్రభుత్వం రాగానే లక్షలాది రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చాం. మేము ఏ బియ్యం తింటున్నామో.. పేదలకూ అవే సన్నబియ్యం ఇస్తున్నాంఅని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ విషనాగు. ఈ పాములో కాలకూట విషం ఉంది. అయితే, ప్రజలు దాని కోరలు ఎప్పుడో పీకేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యారంటూ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. లక్ష కోట్లు- దోచుకున్న వ్యక్తి ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. అక్క, అన్న, చెల్లి, బావ ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారు. దోపిడీ సొమ్ము వాళ్లింట్లో చిచ్చు పెట్టింది. సంపాదించుకున్న టీవీలు, పేపర్ల కోసం కొట్టుకుంటున్నారు. వాళ్లు వాళ్లు కొట్టు-కుంటూ మాపై నిందలు వేస్తున్నారు. మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు. చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేముంది. బీఆర్ఎస్ ను ప్రజలే బొందపెట్టారని సీఎం రేవంత్ మండిపడ్డారు. దామరచర్ల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సొంతిల్లు అనేది ప్రతి పేదవాడి జీవితస్వప్నం అని.. గత పదేళ్లు పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదని అన్నారు. ఏటా 2 లక్షల ఇళ్లు కట్టినా పదేళ్లలో 20 లక్షల మందికి వచ్చేవని.. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనబడుతోంది. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తెచ్చిన ధరణికి పాతరేసి భూభారతి తీసుకొచ్చి రైతుల సమస్యలు పరిష్కరించామని వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మన పిల్లలు బర్రెలు, గొర్రెలు కాచుకోవాలని కేసీఆర్ పార్టీ వాళ్లు అంటారని.. వాళ్ల పిల్లలు మాత్రం చదువుకుని రాజ్యం ఏలి దోచుకుంటారట అంటూ తీవ్రంగా విమర్శించారు. టీవీలు, పేపర్లు సంపాదించుకు న్నారు.. వాటి కోసం కొట్టు-కుంటున్నారని ఆరోపించారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడాలని కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిశారు. ఇది ఎన్నికల స్టంట్ కాదు. ప్రజలు ఆలోచన చేయాలి. రోటి, కప్డా, మకాన్ అనే నినాదాన్ని నాడు ఇందిరమ్మ కొనసాగిస్తే, అదే నినాదాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గల్లీ గల్లీ.. ఊరు ఊరు తిరిగి ప్రతి పేద వాడికి 25 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊర్లోనే ఓట్లు- అడుగుతామని 2023 ఎన్నికల్లో కేసీఆర్‌కు సవాలు విసిరా. పేదలు ఇందిరమ్మ ఇళ్లలోకి గృహ ప్రవేశం చేసినప్పుడు కలిగిన ఆనందం నేను జూబ్లీహిల్స్‌లో గృహప్రవేశం చేసిన రోజు కూడా రాలేదన్నారు. 4500 ఇండ్లు కేవలం అశ్వరావు పేటకు ఇచ్చా. కొందరికి పేదరికం అంటే ఎక్స్ కర్షన్.. మేము పేద వర్గంలో పుట్టి పెరిగి, వారితో అన్ని సమానంగా పంచుకున్నాం. పేదలుగా బతకడం మా జీవన విధానం. పేదరికం తెలిసి, కుటుంబ సభ్యులుగా భావించే పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఇందిరమ్మను పేద ప్రజల గుండెల్లో అమ్మలా గుడి కట్టుకున్నారు. పేదలు కళ్లు కాయలు కాసేలా వేచి చూసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమం అందలేదు.ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి కలిగిన జిల్లా. అందుకే ఈ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులను చేశాం. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి. పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉండి ఉంటే పేద వర్గాల కష్టాలు తీరిపోయేవని సీఎం అన్నారు. కర్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేతలకు సిగ్గులేదు. ఒకడు ఆరు లక్షలు అంటడు.. ఇంకొకడు ఏడు లక్షలు అంటడు. ఇంకోడు ఎనిమిది లక్షలు.. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నాడు.. ఆధారం, ప్రామాణికం, పత్రం అడిగితే లేదంటరు. ఉపన్యాసాలు అదరగొట్టాలి.. మీడియా మేనేజ్‌మెంట్ చేసుకోవాలి.. ఇదే కాంగ్రెస్ నేతల పని. వారి మీదికి దృష్టికి రాకుండా.. డైవర్షన్ గేమ్ ఆడుతున్నారు. కాళేశ్వరం, ఫార్ములా రేస్, విద్యుత్ అంశాల మీద సొల్లు పురాణం తప్ప ప్రజలకు పనికొచ్చే పని చేయలేదు అని కేటీ-ఆర్ నిప్పులు చెరిగారు.పంచాయతీ ఎన్నికలు అయినా, ఢిల్లీ ఎన్నికలు అయినా ఎగరాల్సింది గులాబీ జెండానే. కేసీఆర్ నాయకత్వంలో ముందుకు పోవాలి. చిన్నచిన్న సమస్యలు ఉంటాయి.. వాటిని పకక్కన పెట్టాలి. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి. ప్రజలు ఇవాళ కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటు-న్నారు ఎందుకంటే.. మన మధ్యన ఒక పెద్దాయన ఉంటే ఆయన విలువ తెలియదు. ఆయన ఆ పోజిషన్‌లో లేనప్పుడే తెలుస్తుంది. ఎప్పుడైనా చీకటిని చూస్తనే వెలుగు విలువ తెలుస్తుంది. గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది. ఇవాళ గాడిదులు ఎవరైతే ఉన్నారో వారిని చూసిన తర్వాత కేసీఆర్ విలువ ప్రస్ఫుటంగా తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయామని రైతులు బాధపడుతున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం ఇవ్వడం లేదు.. చివరకు ఇనుము కూడా ఇవ్వరు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదు. ఇది దండుపాళ్యం బ్యాచ్.. బంగారం ఇచ్చే బ్యాచ్ అసలే కాదు. ఒక్కొక్క వర్గాన్ని చైతన్యవంతం చేసి.. గెలుపు దిశగా పయనించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## విదేశాల నుంచి ఆగిన యూరియా దిగుమతులు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నుల్లో 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారు. ప్రతి నెలలో పంపిణీ చేయాల్సిన యూరియాలో కోత పెట్టారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నులు సరఫరా చేయలేదు. ఇతర దేశాల నుంచి వస్తోన్న యూరియానే సరఫరా చేస్తున్నారు. రామగుండం పరిశ్రమ నుంచి కూడా ఒక్క బస్తా ఇవ్వలేదు. కొరత కారణంగా రాష్ట్ర రైతులు ఆందోళనలో ఉన్నారు. అన్ని పంటలకు సెప్టెంబర్‌లో యూరియా చివరి కోటా వేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల భారీ వర్షాల వల్ల ఆరేడు జిల్లాల్లో అన్ని శాఖల్లో తీవ్ర నష్టం సంభవించింది. రాష్ట్రంలో పంటలు, రోడ్లు, మౌలిక సౌకర్యాలు దెబ్బతిన్నాయి. చేనేత రంగంపై పన్నులు ఉండకూడదని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ఆయిల్‌పామ్ దిగుమతిపై సుంకాలు 40 శాతానికి పెంచాలని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారత రాష్ట్ర సమితి నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారంతో తమకు సంబంధం లేని వ్యవహారం అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 25000 కనీస మద్దతు ధర కల్పించేలా ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని మంత్రి విజ్ఞప్తి.చేశారు. తెలంగాణలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను ప్రధాన్ మంత్రీ ధన్-ధాన్య కృషి యోజన పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

## స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో స్టేషనరీ, ఇతర సామాగ్రి బహుకరణ



**తెలుగు-వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):**జనరల్ సెక్రెటరీ ఎల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియన్ స్టాఫ్ యూనియన్ సభ్యులు తెలిపారు. బుధవారం అమరావతి సర్కిల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియన్ స్టాఫ్ యూనియన్ ఏడవ అవతరణ దినోత్సవం సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు.అనపర్తి శివారు కొత్తూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియర్ జూనియర్ కళాశాల విద్యార్థుల సౌకర్యం కోసం ఇన్వర్టర్లు,సీలింగ్ ఫ్యాన్స్ యూనియన్ సభ్యులు అందజేశారు. లైబ్రరీకి జేఈఈటి, ఎన్ఈఈటి బుక్స్ బహకరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎస్ పాపారావు, వైస్ ప్రెసిడెంట్ పేరి శాస్త్రి, ఏజీఎస్ చంద్రశేఖర్, ఆర్ఎస్ అప్పారావు, కె రాజశేఖర్, మణికంఠ, ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ రామాంజనేయులు, ప్రిన్సిపల్ రాజు పాల్గొన్నారు.

## బిక్కవోలు గణపతి హెూమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు



**తెలుగు-వెలుగు, తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి):**చెవిలో చెబితే కోరిన కోరికలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసించే బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి హెూమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ప్రత్యేక పూజలు అనంతరం శ్రీ లక్ష్మీ గణపతి స్వామిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు.అదేవిధంగా పెదపూడి మండలం గొల్లల మామిడాడ ధ్వజస్తంభం వీధి, మెరక వీధి, పెదపూడి లక్ష్మీ సరస్వతి సహిత వినాయక ఆలయం, రంగంపేట మండలం జి దొంతమూరు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయకుడిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉల్లాస్‌తో సంపూర్ణ అక్షరాస్యత: ఎమ్మెల్యే నల్లమిల్లి




**తెలుగు-వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పుడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని తద్వారా సంపూర్ణ అక్షరాస్యత సాధించవచ్చని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణా తరగతులను ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిక్షణ తరగతులకు హాజరైన వాలంటీర్లు అందరూ మండలంలోని నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి వారిని అక్షరాస్యులుగా చేసేందుకు కృషి చేయాలని సూచించారు. బిక్కవోలు ఎంపీపీ తేతలి సుమ, ఎంపీటీసీలు, ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కురవి మండల కేంద్రంలోని 1వ వార్డులో వినాయక అన్నదాన కార్యక్రమం




**(తెలుగు వెలుగు డోర్నకల్ నియోజకవర్గ బ్యూరో):** కురవి మండల కేంద్రంలోని 1వ వార్డులో ప్రసాద్ఉమా, జక్కుల చంటి శ్రావణి దంపతుల ఆధ్వర్యంలో వినాయక అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కురవి మండల ప్రధాన కార్యదర్శి అవీర మోహన్ రావు, పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆవేర మోహన్ రావు మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం ఉండాలని వినాయకుని వేడుకున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చాలా చేయాలని అన్నారు.కమిటీ సభ్యులు జక్కుల చందర్ రావు, పూసల సాయి కురవి మండల ప్రధాన కార్యదర్శి అవేర మోహన్ రావుని శాలవతో కమిటీ సభ్యులు హాలో సత్కరించారు. ఆ తరువాత కురవి మండల కేంద్రంలో ఉండేటువంటి భక్తులు భారీ సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత: టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** వినాయక నవరాత్రి ఉత్సవాలు పిల్లలను, యువతను సమైక్యంగా ఉంచుతాయని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు.వినాయక నవరాత్రులు పురస్కరించుకొని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం కూకట్ పల్లి, అల్లాపూర్ డివిజన్ లో పలు ఉత్సవ కమిటీలు, సంక్షేమ సంఘాలు వివిధ మండపాల్లో ప్రతిష్టించిన వినాయకుల మండపాలని సందర్శించి స్థానిక వాసులతో కలిసి గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గణేశుని చతుర్థి ఉత్సవాలు ఐక్యతకు ప్రతీకలని, కులమతాలకు అతీతంగా ఈ ఉత్సవాలల్లో అందరూ పాల్గొనడం యాంత్రిక జీవనానికి అలవాటుపడిన ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత పొందుతారని అన్నారు. గణేశుని దీవెనలతో అన్ని విఘ్నలు తొలిగి ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, మస్తాన్ రెడ్డి దేవరింటి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, పులిగోళ్ళ శ్రీనివాస్ యాదవ్, కూకట్ పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, రాజు చారి, సత్యం, లక్ష్మీనారాయణ, యాదగిరి, అహ్మద్, బొల్లు శ్రీనివాస్, జగన్, పన్నాల రాజశేఖర్ రెడ్డి, కృష్ణ మూర్తి, అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

### ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తే డిజేల పై కేసులు నమోదు, కఠిన చర్యలు తప్పవు.: ఎస్.ఐ పడాల రాజేశ్వర్




**తెలుగు వెలుగు ప్రతినిధి(ఏర్గట్ల, మండలం)**గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతి యుతంగా నిమజ్జనం జరుపుకోవాలని, నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు పోలీసుపరంగా అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏర్గట్ల ఎస్ఐ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిమితికి మించి సౌండ్ పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించడం,అంతే కాకుండా నిమజ్జన ఉత్సవాల సమయంలో అనవసర అల్లర్లకు పాల్పడటం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయడం,శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంవంటి వాటి పట్ల కటిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ తెలిపారు. నిమజ్జనం శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో, మద్యపానం సేవించకుండా జరుపుకోవాలని , గణేష్ మండలి నిర్వాహకులకు సూచించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే డీజే నిర్వాహకుల మీద, గణేష్ మండలి నిర్వాహకుల మీద చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గణేష్ మండపాల వద్ద అన్నదానం

**తెలుగు వెలుగు ప్రతినిధి (ఏర్గట్ల, మండలం )**వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండల కేంద్రం ఏర్గట్ల లోని శివ మార్కెండేయ యువజన సంఘం, సహృదయ యువజన సంఘం, రాయల్ గాయస్ యూత్, ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపాల వద్ద భక్తులు యువజన సంఘాల సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భక్తులు వినాయకుడు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పిల్ల పాపాలతో,సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని,పాడిపంటలు బాగుండాలని వినాయకుడిని వేడుకున్నారు. యువజన సంఘాలు,అన్నదాన దాతలు, భక్తులు, తదితరులు, పాల్గొన్నారు .



## ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను లైసెన్సుడ్ సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి. ఏ .ఐనేష్

### మొదటి విడత శిక్షణలో ఉత్తీర్ణులైన లైసెన్స్ సర్వేయర్లకు సర్టిఫికెట్‌లు అందజేత

**సంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం నూతన రెవెన్యూ సంస్కరణలలో భాగంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంలో సర్వేయర్లకు సంబంధించిన స్థానం కల్పించిందని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఏ. ఐనేష్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన లైసెన్స్ సర్వేయర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వేయర్లకు పెద్ద ఎత్తున అవకాశం ఇవ్వడం జరుగుతుందని మొదటి విడత ఉత్తీర్ణులైన సర్వేర్లు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు . భూములకు సంబంధించి క్రయవిక్రయాలు జరిగిన లేదా ఇతర ఎలాంటి లావాదేవీలు జరిగిన సంబంధిత భూములకు సంబంధించి సర్వే, సర్వే మ్యాప్ లను ఆధారంగా చేసుకుని ఇక మీదట భూభారతి చట్టంలో జరిగేలా ప్రభుత్వం నూతన చట్టం తీసుకువచ్చింది అన్నారు. దీంతో సర్వేయర్లకు, లైసెన్స్ సర్వేయర్లకు అనేక అవకాశాలుఏర్పడతాయన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాలను లైసెన్సుడ్ సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తప్పులకు అవకాశం లేకుండా భూములకు సంబంధించిన కొలతలు మ్యాపులను రైతులకు అందించాలని సూచించారు. శిక్షణలో ఉత్తీర్ణులు కానీ సర్వేయర్లకు ఈనెల 13 ,14 తేదీలలో మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఏ. ఐనేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్లు ఎం రాజు, శ్రీనివాస్, బిక్షపతి, రుహుల్ల, కార్యాలయ సూపరిండెంట్ ఇందిరా ట్రైనింగ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ గణపతిని దర్శించు కొని ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర టిజివో నాయకులు



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** ఖైరతాబాద్ మహా గణపతిని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్, సిటీ అధ్యక్షులు గండూరి వెంకటేశ్వర్లు వారి కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ గణాధీశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ యావత్ ప్రజలు, ఉద్యోగులు సుఖసంతోషాలతో ఉండాలని గణాధీశ్వరుని ప్రార్థించారు.ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు దీప రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శిరీష రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రామరావు, హైదరాబాద్ జిల్లా జాయింట్ సెక్రెటరీ డాక్టర్.క్రొత్త విద్యాసాగర్, టిన్జీవో నాయకుడు, గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్ (చందు), శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భవిష్యత్ రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకం: డీడబ్ల్యూఓ లలితా కుమారి

### ● మహిళలు, బాలల రక్షణ - ప్రతి ఒక్కరి బాధ్యత






**సంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** మహిళలు, బాలల రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకమని, బాలికల విద్య, భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. లలితా కుమారి అన్నారు . పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం లో భాగంగా మంగళవారం జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో పిసిపీఎన్డీటీ చట్టం, పాక్సో చట్టం, గృహ హింస చట్టం, పోష్ చట్టం బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు . మహిళలు, బాలల రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకమని, బాలికల విద్య, భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, PCPNDT చట్టం ప్రకారం లింగ నిర్ధారణ నిషేధమని, దానిని అరికట్టడంలో అందరూ కట్టుబడి ఉండాలని,అన్నారు . పాక్సో చట్టం బాలలపై లైంగిక దాడులను అరికట్టడంలో కఠిన చర్యలు తీసుకుంటుందని, గృహ హింస మరియు పోష్ చట్టాలు మహిళలకు బాలికలకు రక్షణ కల్పిస్తున్నాయని,బాల్య వివాహాల నివారణ సమాజం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అదే విధంగా, బేటీ బచావో బేటీ పడవో కార్యక్రమంలో భాగంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. బాలికల రక్షణ, విద్య, సాధికారతకు కట్టుబడి ఉంటామని అంగీకరించారు. డీడబ్ల్యూఓ గారు చిరకపల్లి 2 ఆంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి, జరిగిన సెక్టార్ మీటింగ్‌లో ఆంగన్‌వాడీ టీచర్లతో సమావేశమై పౌష్టికాహారం పంపిణీ, గర్భిణీ స్త్రీల, బాలల ఆరోగ్య పరిరక్షణపై సూచనలు అందించారు. అనంతరం చిరాగ్ పల్లి అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు . ఈ కార్యక్రమంలో సీడీపీవో అంజమ్మ , మెడికల్ ఆఫీసర్ సోయల్ , జిల్లా సమన్వయకర్త పల్లవి, ఆంగన్‌వాడీ టీచర్లు ఆశలు, సూపర్వైజర్ లు ,తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ గణపతి మండపం వద్ద ఘనంగా అన్న ప్రసాద కార్యక్రమం...

● మండపం ప్రాంగణంలో మహిళలచే కుంకుమార్చన...





**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్లో గల వెంకటేశ్వర్ నగర్ లోని 35 బ్లాక్ వద్ద కొలువుదిరి ఉన్న భారీ గణనాథుని వద్ద బుధవారం అన్న ప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్థానిక మహిళలచే ప్రత్యేకంగా కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, వివేకానంద నగర్ డివిజన్ కు చెందిన సీనియర్ నాయకులు జి సంజీవరెడ్డి, కూకట్పల్లికి చెందిన పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులు సిహెచ్ హనుమంతరావు ప్రధాన కార్యదర్శి గిన్నె ప్రవీణ్ సాగర్ కోశాధికారి కెపి కిషోర్ల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలకు హాజరైన వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు మంజుల స్రవంతి సునీత ప్రమీల శ్రీలత కవిత రజిని శివాని కావ్య చైతన్య అనిత అంజమ్మ అంబికా శ్రావణి మీనా తదితరులు పాల్గొన్నారు.

# రాణా ప్రతాప్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం గణపతి హోమం గణపతి పూజ




**సదాశివపేట సెప్టెంబర్ 3తెలుగు వెలుగు ప్రతినిధి:** సదాశివపేట యూత్ అధ్యక్షుడు అయినటువంటి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ పిల్లోడి విశ్వనాథం దంపతులు వేద పండితుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో గణపతి హోమం మరియు గణపతి పూజ నిర్వహించారు. తదనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూత్ సభ్యులు గణపతి మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మండపాన్ని చూడడానికి ప్రజలు తండోపతండాలుగా తరలివస్తు న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పిల్లోడి జయమ్మ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు పిల్లోడి రామ్ కుమార్, పిల్లోడి లక్ష్మణ్ కుమార్ మరియు యూత్ సభ్యులు రాజు, శివ, శ్రీకాంత్, మహాలింగం, కిరణ్, గాండ్ల మల్లన్న, సిద్ధూ, చీల విష్ణు, బొంతపల్లి శ్రీనివాస్, వెంకట్, గంట రవి, రాము మరియు అల్గోల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వైద్య ,ఆరోగ్య ,శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆరోగ్య ,శాఖ పనితీరు పై ఉన్నత స్థాయి సమీక్ష




**హైదరాబాద్ సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** సమీక్షలో ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పన పై చర్చ.హాస్పిటల్ లలో ఎక్విప్మెంట్ పనితీరు పై చర్చించారు . ప్రభుత్వ ఆసుపత్రి లలో మెరుగైన వైద్య సదుపాయాల కల్పన పై చర్చ ,ప్రభుత్వ హాస్పిటల్ లలో భాగంగా గాంధీ ఆసుపత్రి బ్రాండింగ్ పై చర్చ . ప్రభుత్వ ఆసుపత్రులలో శానిటేషన్ , ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు , ఎక్విప్ మెంట్ వినియోగం పై మంత్రి చర్చించారు . ఎమర్జెన్సీ ఎక్విప్ మెంట్ లను వెంటనే రిపేర్లు చేయాలని మంత్రి ఆదేశించారు . 8 ఏండ్లు దాటిన ఎక్విప్ మెంట్ లను స్క్రాప్ చేయాలని మంత్రి ఆదేశం .NCD క్లినిక్‌ల పనితీరు పై చర్చించారు .ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు ఐదు అంతస్తులతో నిధులతో సౌకర్యవంతమైన బిల్డింగ్ ను ఏర్పాటు పై సమీక్ష .ఈ సమీక్ష లో హెల్త్ సెక్రటరి డా . క్రిస్టినా చోంగ్తూ , హెల్త్ కమిషనర్ సంగీత సత్యానారాయణ , ఫణింద్ర రెడ్డి , ఆరోగ్య శ్రీ ఉదయ్ కుమార్ ,డా . రవీంద్ర కుమార్ , డా. అజయ్ కుమార్ , ఉన్నతాధికారులు డా. వాణి, డా . విమల థామస్ లు పాల్గొన్నారు.


# జీపీఓ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీకి ఏర్పాట్లు

● జీపీఓ అభ్యర్థుల కోసం ఉచిత బస్సులు - ప్రత్యేక అధికారులు నియామకం: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా జీపీఓ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ హైటెక్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నారు. హైదరాబాద్ నుండి రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు .ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అన్ని జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ు- అభ్యర్థులు హైదరాబాద్‌కు చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జిల్లాల వారీగా ఎంపికైన అభ్యర్థులకు ముందుగానే సమాచారం అందించి, సమయానికి హైటెక్స్‌కు చేర్చాలని ఆదేశించారు. నియామక కార్యక్రమానికి సంబంధించి సంబంధిత జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులకు కూడా సమాచారం ఇవ్వాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురీ, డిఆర్ఓ పద్మజారాణి, కలెక్టరేట్ ఏఓ ఆంథోనీ పాల్గొన్నారు. ఈ కాన్ఫిరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ు- సంగారెడ్డి జిల్లా నుంచి మొత్తం 239 అభ్యర్థులు ఎంపికైనట్లు వివరించారు . ఇందులో స్థానిక కోటా కింద 209, స్థానికేతర కోటా కింద 10 పోస్టులు కేటాయించగా, అదనంగా 20 పోస్టులను మెదక్ జిల్లాకు అలాట్మెంట్ చేసినట్లు వివరించారు. అభ్యర్థుల రవాణా సౌకర్యం కోసం ఉచిత బస్సులు, లైజన్ అధికారులను, పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. అభ్యర్థులు మధ్యాహ్నం 2 గంటలలోపు హైటెక్స్‌కు చేరుకోవాలని సూచించారు.

# కెపిహెచ్బి కాలనీ నాలుగో ఫేస్ వినాయక మండపం వద్ద అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమం...

● ఉత్సవ కమిటీ నిర్వాహకులు శంకర్ రెడ్డి, కోదండ రామయ్య ఆధ్వర్యంలో ముఖ్య నేతలకు సన్మానం...

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కెపిహెచ్బి కాలనీ నాలుగవ ఫేస్ వినాయక ఆలయము లో జరిగిన అన్న ప్రసాద కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి కాలనీ డివిజన్ కార్పొరేటర్లో మందడి శ్రీనివాసరావు, డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, బాసిని శ్రీనివాస్ రావు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు ముఖ్యఅతిథిగా పాల్గొని మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు శేఖర్ రెడ్డి, కోదండ రామయ్య, నాలుగో ఫేస్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్విన్ కాలనీ డివిజన్లో వివిధ మండపాలవద్ద విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసిన వి.ఆర్.ఎస్ నేత ఎర్రబెల్లి సతీష్ రావు...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజికవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ సాయి నగర్ లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం వారి ఆధ్వర్యంలో, టీం ధార్మిక్ వారి ఆధ్వర్యంలో, ఆల్విన్ కాలనీ లాస్ట్ బస్టాప్ వద్ద కృష్ణా రావు ఆధ్వర్యంలో, ఎన్టీఆర్ నగర్ లోని ఏకదంతయ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో, శివమ్మ కాలనీ లోని టీం ఏకదంతయ వారి ఆధ్వర్యంలో, ధాతాత్రేయ కాలనీ లోని శ్రీకాంత్ %ఒ% టీం ఆధ్వర్యంలో ఇతర కాలనీల్లోని పలు గణేష్ మండపాలను బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు సందర్శించి విఘ్నేశ్వర స్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాధవరెడ్డి, కేబుల్ సాయి, సాయి గౌడ్, సురేష్, అరుణ్ రెడ్డి, ఆయా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాలనగర్‌లో గణనాథునికి ఘనమైన పూజలు చేసిన కాండూరి...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** బాలానగర్ డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను మాజీ కార్పొరేటర్ కాండూరి నరేందర్ ఆచార్య సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కాండూరిని మండపనిర్వాహకులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వినోద్ నాయుడు, ప్రదీప్, ఉపేందర్ రెడ్డి, కాళిదాస్, కిషోర్ కుమార్ రెడ్డిఈ సందర్భగా పాత మిత్రుడు గోల్డ్ మ్యాన్ చిన్నా గౌడ్ తో పాటు స్థానిక నేతలు పుల్లి శ్రీకాంత్ గౌడ్ పటేల్ , దారం సతీష్ గుప్తా లు పూజ కార్యక్రంలో పాల్గొన్నారు.

# కంప్యూటర్స్, ఫర్నిచర్ అందజేసిన ఎమ్మెల్యే "నల్లమిల్లి"



**తెలుగు-వెలుగు,తూ.గో.జిల్లా(అనపర్తి):** ఎంపీపీ నిధులు రూ. ఒక లక్ష 85 వేలు తో కొనుగోలు చేసిన కంప్యూటర్స్, ఫర్నిచర్ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందజేశారు. బుధవారం బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి ఫర్నిచర్, కంప్యూటర్స్ అందజేయడం జరిగింది. ఎంపీపీ తేతలి సుమ, ఎంపీటీసీలు, ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద అన్నదానం



**తెలుగు వెలుగు ప్రతినిధి (ఏర్గట్ల,మండలం)**వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండల కేంద్రం ఏర్గట్ల లోని శివ మార్కెండేయ యువజన సంఘం, సహృదయ యువజన సంఘం, రాయల్ గాయస్ యూత్, ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపాల వద్ద భక్తులు యువజన సంఘాల సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భక్తులు వినాయకుడు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పిల్ల పాపాలతో,సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని,పాడిపంటలు బాగుండాలని వినాయకుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమల్లో యువజన సంఘాలు,అన్నదాన దాతలు, భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.

# మనోమే బృందం గణేశునికి 108 రకాల నైవేద్యం




**సదాశివపేట సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** బుధవారం నాడు గణేష్ ఉత్సవాల సందర్భంగా మనోమే బృందం ఆధ్వర్యంలో చిప్పల్ తుర్తి కుటుంబం ఆధ్వర్యంలో గణేశునికి 108 ని సంస్కృతంలో మనోమే అని అర్థం కాబట్టి 108 రకాల నైవేద్యాలుగా సమర్పించామని నిర్వాహకులు తెలిపారు. మరియు హోమ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షులు నర్సింగ్ రావు ఆధ్వర్యంలో శ్రీనివాస్ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి, నర్సింగ్ రావు, సాయి వెంకట్, శివ, భాను ప్రకాష్ పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడం జరిగింది.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
గురువారం,
04 సెప్టెంబర్ 2025



# సైబర్ జాగ్రుకత దివాస్ - జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు..

### సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాహన ఒక్కటే మార్గం.. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్

### సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్.వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎల్లేంకి డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం..

### సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శికాగోయల్ ఐపిఎస్ ఆదేశాలనుసారం





**సంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** ఈ రోజు సెప్టెంబర్ నెల మొదటి బుధవారాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సైబర్ జాగ్రుకత దివాస్ పేరుతో వివిధ రకాల ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్.వేణుగోపాల్ రెడ్డి, ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ఎల్లేంకి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. అన్నారు.**ముఖ్యమైన అంశాలు:** ఆర్.టి.ఎ. చలాన స్కామ్స్.. ఫేక్ ప్రొఫైల్ ఫేక్ స్కామ్స్.. కస్టమర్ సర్వీస్ (ఆన్లైన్ బుకింగ్స్) స్కామ్స్.. డిజిటల్ ప్రపంచంలో మీకు మీరే రక్షకులు.. అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలు అనేవి ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు ఎదురుకుంటున్న సమస్య అని, సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాహన ముఖ్యం అన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పన్నిన వలలో పడవద్దన్నారు. సైబర్ నేరాలకు గురిఅవుతున్న వారిలో విధ్యావంతులే అధికం అని, మల్టీ లెవెల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, వంటి ఆన్లైన్ మోసాల పట్ల అవగాహ కలిగి ఉండాలని, మొదట డబ్బులు వస్తున్నట్లు ఆశ చూపించి, ఆతర్వాత ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని గుర్తించాలన్నారు. ఆర్.టి.ఎ. చలాన స్కామ్స్.. మీ వాహనంపై ఆర్.టి.ఎ. ఈ -చలాన ఉందని, దానిని క్లియర్ చేయడానికి apk file ఓపెన్ చేయాలని సూచిస్తారాని, apk file ఓపెన్ చేసిన వెంటనే మన ఫోన్ లో ఉన్న విలువైన సమాచారం సైబర్ మోసాగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుందని, తద్వారా ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని అన్నారు. ఫేక్ ప్రొఫైల్ ఫేక్ స్కామ్స్.. ఫేక్ ప్రొఫైల్ తో పోలీసు అధికారులం అని, కస్టమ్స్ అధికారులం అని గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల నుండి, కాల్స్, వీడియో కాల్స్ వస్తే నమ్మరాదని, ఏ పోలీసు అధికారి ఎంక్వైరీ పేరుతో నేరుగా వాట్స్ ఆప్ వీడియో కాల్స్ చేయరాని, డిజిటల్ అరెస్ట్ అని కాల్స్ వస్తే నమ్మరాదని అన్నారు. అనుమానిత ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ వస్తే సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ నందు రిపోర్ట్ చేయాలని సూచించారు. కస్టమర్ సర్వీస్ స్కామ్స్ (ఆన్లైన్ బుకింగ్స్).. ఆన్లైన్ షాపింగ్ లో భాగంగా వివిధ రకాల సైట్లలో కస్టమర్ కేర్ నెంబర్ల కోసం సర్చ్ చేసిన వెంటనే సైబర్ మోసగాళ్ళు గుర్తించి, తప్పుడు ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ చేసి ఆన్లైన్ లో ఎంక్వయిరీ చేశారని మోసగించి సైబర్ నేరాలకు పాల్పడతారని, అమాయక ప్రజల బాలహీనతే, సైబర్ నేరాగాళ్ల బలంగా.. వివిధ రకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో టెక్నాలజీని వాడుకొని మరిన్ని సైబర్ మోసాలు చేయడానికి అవకాశం ఉందని, సైబర్ నేరాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉన్నప్పుడే సైబర్ నేరాల నుండి బయటపడవచ్చని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయినట్లైతే వెంటనే (గోల్డెన్ అవర్)/48 గంటలలో పు 1930కు కాల్ చేసి గాని, యన్.సి.ఆర్.బి. (https://www.cybercrime.gov.in) పోర్టల్ నందు కాంప్లయింట్ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి టౌన్ ఎస్ఐ సర్ధార్, ఎల్లేంకి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ రెడ్డి D4C, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. హాజరయ్యారు.

# గణనాథుని శోభాయాత్రకు సర్వం సిద్దం..

### పెద్ద శబ్దాలతో కూడిన డి.జె సౌండ్స్ వినియోగించరాదు..

### నిమర్జన సమయంలో సమయమనం పాటించాలి..

### శోభాయాత్ర, నిమర్జన సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సుమారు 800 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు.. జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** రేపు గురువారం, మరియు శనివారం (తేది:04/06-09-2025) జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో వినాయకుల నిమర్జనాలు జరగనున్న నేపధ్యలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సుమారు 800 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. గణేష్ శోభాయాత్ర వెళ్ళే మార్గంలో కరెంట్ వైర్ లేకుండా సంభందిత శాఖలకు అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని అన్నారు. పలు ప్రధాన కూడళ్లలో, మజీద్లు, దర్గాలలు, చర్చీల పై రంగులు (గులాల్) పడకుండా ఎతైన బారికెట్స్ తో పాలితిన్ కవర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శోభాయాత్రను వీక్షించడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిమర్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద నీళ్ళలోనికి దిగకుండా బారికెట్స్ ఏర్పాటు చేయించడం జరిగిందని, విగ్రహాలను నిమర్జనం చేయడానికి క్రేన్ లను అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రమాదవశాత్తు అనుకోని ప్రమాదం జరిగిన తక్షణం స్పందించడానికి గజ-ఈతగాళ్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. సబ్-డివిజన్ల వారీగా డియస్పి లచే బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడం జరుగుతుందని, అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు తక్షణం స్పందించి, గుంపును చెదరకొట్టడానికి స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టిమ్స్ సిద్దంగా ఉంటాయన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ, మండప నిర్వాహకులు పోలీసు వారితో సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. **గణనాథుని శోభాయాత్ర, నిమజ్జన సమయంలో పాటించవలసిన సూచనలు:** 1. ఊరేగింపులో డి.జె. లకు అనుమతిలేదు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి డి.జె.లు వినియోగిస్తే, అట్టి డి.జె. లను సీజ్ చేయడంతో పాటు, సంభందిత నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. 2. వినాయక విగ్రహములను తీసుకొనివెళ్లే వాహనములలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, టపాకాయలు, మండే స్వభావం కలిగిన పదార్ధాలు అనగా పెట్రోలు, డీజిల్ మొదలగునవి ఉంచరాదు. 3. విగ్రహాలను తీసుకొని వెళ్లే వాహనాల, డ్రైవర్ల యొక్క పూర్తి వివరాలు పోలీసు వారికి తెలియజేయాలి. వాహనం మంచి కండిషన్ లో ఉండే విధంగా చూసుకోవాలి. 4. నిమజ్జనంలో పాల్గొనే వారు ఎలాంటి మత్తు పదార్ధాలు సేవించకుండా నిర్వాహకులు జాగ్రత్తపడాలి. 5. ఎలాంటి వదంతులను నమ్మకూడదు, ఏదైనా సమాచారం తెలిసినా, అసత్య ప్రచారాలు చేసినా అలాంటి వ్యక్తుల వివరాలను డయల్ 100 ద్వారా లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలి. 6. ఊరేగింపులో కుంకుమ, గులాల్ మొదలైన రంగులను దారిన పోయే వారిపై చల్లకూడదు.

# సమర్థుడనే పొంగులేటికి ఆ రెండు శాఖలిచ్చా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** సమర్థుడనే పొంగులేటికి ఆ రెండు శాఖలిచ్చానని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని చంద్రుగొండలోని బెండాలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశం సందర్శంగా జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ, ఇందిరమ్మ ఇల్లు లేరి ఊరు ఉండదని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. పేద వాళ్లందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా.. ధరణి భూతం నుంచి రైతుల్ని విముక్తుల్ని చేయాలన్నా.. సమర్థుడ్కైన మంత్రి కావాలని భావించా నన్నారు. అందుకే, పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖలు కేటాయించానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# పత్తి దిగుమతి సుంకాలు తగ్గించే నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** ముడి పత్తి దిగుమతి సుంకాలు తగ్గించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే ఫారెన్ ట్రేడ్ అగ్రిమెంట్ రద్దు చేయాలని ఎస్ కే యం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ కే యం పిలుపులో భాగంగా దిగుమతి సుంక జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోకినపల్లి ప్రభాకర్ సిపిఐ జిల్లా నాయకుడు జి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న పత్తి దిగుమతి సుంకాలను రద్దు చేయటం వల్ల భారత రైతంగం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. అలాగే వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నష్టం కలిగించే పారెన్ ట్రేడ్ అగ్రిమెంటును రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఎంఎస్పి ప్రకారం పత్తికింటాలకు రూ. 10,075 రూపాయలు చెల్లించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25 లక్షలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో మాస్ ల్కెన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, పి వై ఎల్ డివిజన్ కార్యదర్శి బాడిస లక్ష్మణరావు, ఐక్య రైతు సంఘం మండల కార్యదర్శి గొంది లక్ష్మణ్‌రావు, రైతు సంఘం నాయకులు కంగాల కన్నయ్య, టియుసిఐ నాయకులు కుమారస్వామి, జె శ్రీనివాసరావు, ఎన్ చిలకరావు, మహేశ్వరావు, సిపిఐ టౌన్ కార్యదర్శి విజయ్ కాంత్, నాయకులు చీపుర్ల సత్యవతి, గద్ద సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేట పట్టణంలో కుబేర రెస్టారెంట్ ప్రారంభం



**సదాశివపేట సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి** పట్టణంలో కుబేర రెస్టారెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో కొత్తగా ప్రారంభమైన కుబేర రెస్టారెంట్ స్థానిక ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా రెస్టారెంట్ వ్యాపారం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన్న, హొటల్ యజమానులు మఠం శ్రీశైలం స్వామి,గౌండ్ల రాజు గౌడ్, సూరారం పవన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


## ఆరోగ్యంగా జీవించాలంటే వ్యాయామం, క్రీడలు ఎంతోఅవసరమన్నారు: మంత్రి దామోదర్ రాజనర్సింహా.






**హైదరాబాద్ సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా బుధవారం హైదరాబాద్ లోని ఉప్పల్ - కాప్రా లో బ్యాడ్మింటన్ అకాడమి లో ఫైర్ ర్యాలీ ని ప్రారంభించారు.నేటి యువత క్రీడల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు . శారీరకంగా,మానసికంగా దృడంగా ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు . ఆరోగ్యంగా జీవించాలంటే వ్యాయామం, క్రీడలు ఎంతోఅవసరమన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహా. ఈ సందర్భంగా క్రీడాకారులతో మంత్రి బ్యాడ్మింటన్ ఆడారు.

## రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి : ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి సెప్టెంబర్ 3 తెలుగు వెలుగు ప్రతినిధి:**రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సదాశివపేట AO రమేష్ తో ఫోన్ లో మాట్లాడి యూరియా కొరత పై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేయాలని సూచించారు. యూరియా స్టాక్ అందుబాటులో ఉంచాలని ... రైతులను యూరియా కోసం ఇబ్బంది పెట్టకూడదని పేర్కొన్నారు. స్టాక్ ఎంత ఉంది అని అడిగి తెలుసుకున్నారు... యూరియా కోసం రైతులను క్యూ లైన్ లో , చెప్పులు ఉంచకుండా యూరియా సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో PACS చైర్మన్ రత్నాకర్ రెడ్డి ఉన్నారు.

# హనుమంతుని గుడి లేని గ్రామం, గూడెం ఉండొచ్చు గాని, ఇందిరమ్మ ఇండ్లు లేని తండా, గూడెం, గ్రామం ఉండదు... సీఎం రేవంత్ రెడ్డి



**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం**

**పేదరికం నిర్మూలనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం**

**విద్య ద్వారానే పేదల జీవితాలు మారతాయి**

**ఏటీసీ కేంద్రాలలో నైపుణ్య శిక్షణ అందించి మంచి ఉపాధి అవకాశాలు కల్పన**

**చుండ్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం**













**చండ్రుగొండ, సెప్టెంబర్-03:** హనుమంతుని గుడి లేని గ్రామం, గూడెం ఉండొచ్చు గాని, ఇందిరమ్మ ఇండ్లు లేని తండా, గూడెం, గ్రామం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి,రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘు రాం రెడ్డి లతో కలిసి బుధవారం ఆ పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి గారికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి బి. రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు.బెండలపాడు గ్రామంలోని పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ఇందిరమ్మ ఇండ్ల పైలాన్ ను ఆవిష్కరించి లబ్ధిదారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం చండ్రుగొండ మండలం దామరచర్ల గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ బీజం ఖమ్మం జిల్లాలో ఏర్పడిందని, ఉద్యోగాలు, నిధులు, నీళ్ళు మాకు కావాలని ఖమ్మం ప్రజలు రాష్ట్రానికి ఒక దిక్సూచి చూపించారని సీఎం తెలిపారు. గూడెంలో పేద మహిళలు గత పది సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఆశగా ఎదురు చూశారని, గత పాలకులు వారి ఆశలను వమ్ము చేశారని అన్నారు.పేదల ఆత్మగౌరవం నిలబెట్టాలని ఆనాడు డాక్టర్ వైయస్సార్ సుదీర్ఘ పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్ల పథకం సాచురేషన్ పద్దతిలో అమలు చేశారని, 10 సంవత్సరాల కాలంలో 25 లక్షల ఇండ్లు పూర్తి చేశారని అన్నారు.హనుమంతుని గుడి లేని గ్రామం, గూడెం ఉండొచ్చు గాని, ఇందిరమ్మ ఇండ్లు లేని తండా, గూడెం, గ్రామం ఉండదని అన్నారు. పట్టణ ప్రాంతాలలో రాజీవ్ స్వగృహ పేరుతో ఇండ్లు అందించడం జరిగిందని అన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేయాలని కష్టపడే తత్వం ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కు హౌసింగ్ శాఖ బాధ్యతలు అప్పగించానని అన్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ బాధ్యతలు కూడా వారికి అప్పగించామని అన్నారు. నేడు లక్షలాది రైతుల భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరించడమే కాకుండా, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించడంలో మంత్రి పొంగులేటి కీలక పాత్ర పోషించారని అన్నారు. నిరుపేదల కళ్ళలో ఆనందం చూస్తే చాలా సంతృప్తి ఉందని, జూబ్లీహిల్స్ లో తన ఇంటి గృహప్రవేశం నాడు ఉన్న సంతోషం కంటే నేడు పేద ప్రజల గృహప్రవేశం చూస్తుంటే ఇంకా ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం తెలిపారు. రాష్ట్రమంతా అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేస్తే, అశ్వారావుపేట లో మాత్రం 4500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.పేదరికం తమకు ఎక్సర్షన్ కాదని, జీవన విధానంలో ఒక భాగం అని, పేదరికం తరమాలని తాము కృషి చేస్తున్నామని అన్నారు. గత పాలకుల హయాంలో రేషన్ కార్డు జారీ లేదని, కనీసం కొత్త పేర్ల నమోదు కూడా చేయలేదని సీఎం విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లుఅందించామని అన్నారు. గతంలో పేదలకు దొడ్డు బియ్యం సరఫరా చేస్తే నేడు తమ ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీ పంచాయతీలలో తమను లాగవద్దని, పేదలకు రేషన్ కార్డుల పంచే కార్యక్రమంలో బిజీగా ఉన్నామని సీఎం తెలిపారు. 25 లక్షలకు పైగా రైతులకు 20 వేల 600 రూపాయలతో రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేసామని, 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు.గత 20 నెలల కాలంలో లక్షా 4 వేల కోట్ల రూపాయలు రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. 50 లక్షల పైగా పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. పేదల తలరాతను మార్చేందుకు విద్య చాలా కీలకమని, ప్రస్తుత సంవత్సరం విద్య రంగంపై 40 వేల కోట్ల వరకు ఖర్చు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని అన్నారు.100 నియోజకవర్గాలలో 20 వేల కోట్లు పైగా ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నామని, 40 శాతం డైట్ చార్జీలు,200 శాతం కాస్మోటిక్స్ చార్జీలను పెంచడం జరిగిందని అన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను ఏర్పాటు చేసి నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించి మంచి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు.పేదలు చదువుకునేలా స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. యువత చదువు పై దృష్టి పెట్టాలని, మనం పది మందికి సహాయం చేసేటట్లు ఎదగాలని, దానికి విద్య చాలా అవసరమని అన్నారు. రాబోయే 10 రోజులలో నియోజక వర్గాల వారీగా ఎంపీలను, ఎమ్మెల్యేలను పిలిచి పరిష్కరించాల్సిన సమస్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను, ఇంచార్జి మంత్రి వర్యులను ఆదేశించారు.జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి మాట్లాడుతూ గత పాలకులు పేద ప్రజలను డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసాలకు గురి చేశారని విమర్శించారు. గతంలో వైఎస్సార్ హయాంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించారని తెలిపారు. ప్రస్తుతం అదే తరహాలో మన రేవంతన్న గూడు లేని పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తున్నారని ఆయన తెలిపారు.ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా ఎమ్మెల్యేలు, మంత్రులు పనిచేస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో హామి ఇవ్వకపోయినా , గత పాలకులు అప్పు కుప్పలు చేసినప్పటికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు సంక్షేమం అందాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు.రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదల ఆత్మ గౌరవాన్ని కాపాడే దిశగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని అన్నారు. మొదటి ఏడాది ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని అన్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గిరిజన నియోజకవర్గాలలో అదనపు ఇండ్లు మంజూరు చేయాలని అశ్వరావుపేటకు 1000 ఇందిరమ్మ ఇండ్లను అధికంగా అందించామని, ఐటీడీఏ పరిధిలో 25 వేల ఇండ్లు, చెంచుల ఉప కులాల వారికి 13 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. 22 వేల 500 కోట్ల రూపాయలు మొదటి విడతలో ఖర్చు చేస్తూ పేదలకు ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు.ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. 2004 నుంచి 2014 మధ్య సమయంలో వైఎస్ఆర్ హయాంలో 23 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, అదే విధంగా ప్రస్తుతం కూడా అర్హులైన చివరి పేద వారి వరకు రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మొదటి సంవత్సరం 24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిందని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సరఫరా, సన్న బియ్యం సరఫరా, 7 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, 21 వేల కోట్ల రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసామని అన్నారు. ప్రజా ప్రభుత్వం బేషజాలకు పోకుండా గత పాలకులు దత్తత తీసుకున్న వాసాలమర్రి, చింతమడక గ్రామాలకు కూడా అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తుందని అన్నారు. ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, 55 లక్షల మంది పేద కుటుంబాలకు జీరో కరెంట్ బిల్లు వస్తుందని, 4 వేల కోట్ల సంవత్సరానికి ఖర్చు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 14 వేల కోట్లతో సన్న బియ్యం, 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకం అమలు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వ హయంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారుఅశ్వారావు పేట ఎమ్మెల్యే ఆది నారాయణ మాట్లాడుతూ నేడు ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేరాయని అన్నారు. చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేశామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అశ్వరావు పేట నియోజకవర్గం పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ముందు ఉందని అన్నారు. నేడు గృహ ప్రవేశం జరుపుకున్న లబ్ధిదారుల్లో ఆనందం కనపడింది అని అన్నారు.కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అనేక పోరాటాలు చేసిన ముఖ్యమంత్రి పరిపాలన వచ్చిన తర్వాత సంయమనం కొల్పోకుండా ప్రజాస్వామ్య బద్దంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అర్జి పెట్టుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, పేదలకు సన్న బియ్యం సరఫరా, రైతు రుణమాఫీ,రైతు భరోసా వంటి అనేక హామీలను నెరవేర్చడం జరిగిందని అన్నారు.సీతారామ ఎత్తిపోతల పథకంపై దృష్టి పెట్టి సాగునీటి సరఫరా పెంచాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. గిరిజనులు, ఆదివాసీలు, నిరుపేదలు సాగు చేసుకుంటున్న అడవి భూములకు పట్టాలు అందించాలని అన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రానికి బస్టాండ్ మంజూరు చేయాలని, భద్రాద్రి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా మాలోతు రాందాస్ నాయక్, ఇల్లందు కోరం కనకయ్య, పినపాక పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హౌసింగ్ ఎండి. విపీ గౌతం, అదనపు కలెక్టర్ లు, మృణాల్ శ్రేష్ఠ, స్వయం సహాయక సంఘ సభ్యులు, ప్రజలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

---

# రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం జరగడం సరికాదు

**• ఏపీ ఎమ్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఫారుక్ సుబ్లి**

**కడప సెప్టెంబర్ 03:-** రెండు వర్గాల మధ్య ఘర్షణ దురదృష్టకర మని మనమందరం మనుషుల మే అనే నినాదంతో ఇరువర్గాలని స్థానిక నాయకులు ఏమి చేయకుండా రెండు వర్గాల పై ఆద్యం పెట్టడం సరికాదని ఎం హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఫారుక్ సుబ్లి అన్నారు. అనంతరం కడప నగరం రవీంద్ర నగర్ లోని మత పెద్దలు సయ్యద్ షా మహమ్మద్ తాసిరుల్ల రాష్ట్ర అధ్యక్షులు సుబ్లీ సాహెబ్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. బుధవారం ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేంపల్లి, చెన్నూరు లలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడం చాలా దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘర్షణలు జరిగేటప్పుడు స్థానిక నాయకులు ఇద్దరికీ సర్ది చెప్పాలి కానీ వారికి ఆద్యం పోయడం సరికాదన్నారు. మనమందరం అన్నదమ్ముల కలిసి మెలిసి ఉండాలని కోరారు. టిడిపి ప్రభుత్వంలో కులమతాలకు తావివ్వకుండా అందరిని కలుపుకొని పోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. దేశంలోనే ఇలాంటి ముఖ్యమంత్రి ఉండరని తెలిపారు. అలాగే రాబోయే జనవరి నెలలో కడప నగరం లో రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే దీని ఇస్తిమా కార్యక్రమానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలంటూ ముస్లిం పెద్దలు ఏపీ ఎంహెచ్పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఫారుక్ సుబ్లీ , ఇన్చార్జి షాహిన్ లు పోలిట్ బ్యూరో సభ్యులు టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి లను కలిసి వినతి పత్రం సమర్పించారు.ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో బీజేపీ అడ్డాగా మారింది: ఎన్. రాంచందర్ రావు...






**కరీంనగర్,సెప్టెంబర్03:** కరీంనగర్ జిల్లా ఇప్పుడు భారతీయ జనతా పార్టీకి అడ్డాగా మారిందని, ఇది పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణకు నిదర్శనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శుల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వార్డు మెంబర్ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.అభివృద్ధి, అవినీతిపై బీజేపీ పోరాటంరాం చందర్ రావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారి విస్తరణకు సుమారు రూ. 2 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు దాదాపు రూ. 12 లక్షల కోట్లు నిధులు ఇచ్చిందని, అయినప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు."బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అన్నదమ్ముల్లాంటివి, అవినీతికి కవలపిల్లలు" అని రాంచందర్ రావు తీవ్రంగా ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నాయకులే బయటపెడుతున్నారని, ఇది అవినీతి సొమ్ము పంపిణీలో తేడాలు రావడం వల్లేనని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలురాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన విమర్శల జడివాన కురిపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని, ఉద్యోగులకు జీతాలు, డీఏలు, పీఆర్సీ బకాయిలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించినా ఉద్యోగ నోటిఫికేషన్లు లేవని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని అన్నారు."సీఎం రేవంత్ రెడ్డి 50 సార్లు ఢిల్లీకి వెళ్లారు కానీ తెలంగాణలో పరిపాలనను గాలికొదిలేశారు" అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని, ఎన్నికలలో ఓటమి భయంతో హైకోర్టులో పిటిషన్ వేసి స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలని కోరిందని రాంచందర్ రావు అన్నారు.బీజేపీ గెలుపు ఖాయంకరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన కృషిని రాంచందర్ రావు కొనియాడారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో మాట్లాడి శాతవాహన యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ క్లాసులు తిరిగి ప్రారంభమయ్యేలా చేశారని, 20 వేల మందికి పైగా విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారని చెప్పారు."తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది కేవలం బీజేపీ మాత్రమే. తెలంగాణలో మార్పు రావాలి, బీజేపీ అధికారంలోకి రావాలి" అని రాంచందర్ రావు స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచి 2028 అసెంబ్లీ ఎన్నికల వరకు తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ తెలంగాణలో కూడా వస్తుందని, గ్రామగ్రామాన, పల్లెపల్లెకి వెళ్లి మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



## కలియుగ దైవం గోవిందుడి ఆశీషులు ప్రజలందరిపై ఉండాలి: నీలం మధు ముదిరాజ్

### తిరుమల వేంకటేశ్వర స్వామిని అర్చన సేవలో దర్శించుకున్న నీలం

### శ్రీవారిని నలభై నిమిషాలపాటు దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం

### ఆలయ అర్చకులచే వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందుకున్న నీలం



**సంగారెడ్డి సెప్టెంబర్ 02 :** ఏడుకొండల వాసుడు కలియుగ ప్రత్యక్ష దైవం గోవిందుడి కృపాకటక్షాలు ప్రజలందరిపై ఉండాలి అని ఆ దేవదేవుడిని ప్రార్ధించినట్లు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల వేంకటేశ్వరస్వామి వారి అర్చన సేవలో పాల్గొని ఆ గోవిందుడిని దర్శించుకున్న నీలం మధు ముదిరాజ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభై నిమిషాల పాటు స్వామివారిని ఏడవ ద్వారం లోపల కూర్చొని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతం అని అన్నారు, దర్శన అనంతరం ఆలయ అర్చకులచే రంగనాయక మండపం వద్ద వేద ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు,ఆ శ్రీనివాసుని ఆశీషులతో సమస్త మానవాళి బాగుండాలి అని తెలిపారు..

## ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలి

### ఎస్ఎఫ్ఐ పటాన్చెరు ఏరియా కో కన్వీనర్ సాంసంగ్

**సంగారెడ్డి సెప్టెంబర్ 03:** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మొత్తం 8, 158 కోట్ల నిధులు ఫీజు రియంబర్స్ మెంట్ , స్కాలర్షిప్స్ అనేది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా అవకాశాలను అందించడానికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అది ఎవరి బిక్ష కాదని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు ఉన్నత విద్య అందుకుని ఈ సమాజంలో ఉన్నతమైన స్థాయిలో ఉండటం ద్వారానే ఈ సమాజాభివృద్ధి సాధిస్తుంది అన్నారు.గత ఆరు సంవత్సరాల నుండి 8158 కోట్లు ఫీజు రియంబర్స్ మెంట్ , స్కాలర్షిప్స్ రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఈరాష్ట్రంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిన విద్యార్థులకు స్కాలర్షిప్స్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అంతేకాకుండా భారత దేశంలోనే విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రం కేవలం తెలంగాణ రాష్ట్రం అన్నారు ప్రజా పాలన పేరు తో మాయమాటలు చెప్పుతూ కాలం గడుపుతుందన్నారు అదేవిధంగా స్కాలర్షిప్ విడుదల చేయకపోవడంతో విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టబడుతున్నాయి. ఈ సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు .సకాలంలో స్కాలర్షిప్స్ రాక విద్యార్థుల జీవితాలపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ సకాలంలో చెల్లించకపోతే, విద్యార్థులు తమ కళాశాల ఫీజులను స్వంతంగా చెల్లించలేక, విద్యను మధ్యలోనే ఆపివేయాల్సి వస్తుంది. సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు ఆలస్యం కావడంతో లక్షలాది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు అప్పులు తీసుకోవడం లేదా పార్ట్-టైమ్ ఉద్యోగాలు చేయడం వంటి కఠిన ఎంపికలను ఎదుర్కొన్నారు, ఇది వారి విద్యా నాణ్యతను దెబ్బతీసింది. ఇది ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య వైఖరిని స్పష్టంగా కనిపిస్తుందన్నరు. ఈప్రభుత్వం ఈ స్కాలర్షిప్‌లను విడుదలలో పారదర్శకత లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. ఇది ప్రభుత్వం యొక్క నీతి లేని రాజకీయ వైఖరిని బహిర్గతం చేస్తుంది అన్నారు.విద్యా సంస్థలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఫీజు రియంబర్స్మెంట్ నిధులు సకాలంలో చెల్లించకపోతే, కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు ఆర్థిక సంక్షోభంలో కొరిగిపోతాయి. ఇది విద్యా నాణ్యతను దెబ్బతీస్తుంది, ఉపాధ్యాయుల జీతాలు ఆలస్యం అవుతాయి, మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి స్తంభిస్తుంది. ఈ విధంగా, ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యా వ్యవస్థ మొత్తాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తుంది.అంతేకాక సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి. ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ఎక్కువగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం తీసుకురావడం జరిగింది. కానీ నిధులు ఆలస్యం అవడం వల్ల ఈ విద్యార్థులు విద్యా అవకాశాలను కోల్పోతారు, ఇది సామాజిక ఎదుగుదలను అడ్డుకుంటుంది. ఇది ప్రభుత్వం యొక్క సామాజిక న్యాయ హామీలను ఒక ఊహాజనిత ఆలోచనగా మార్చేస్తుంది. ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోవడం అనేది ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం, అసమర్థత,స్పష్టంగా కనబడుతుందని అన్నారు ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బకాయిలను విడుదల చేయాలని లేకపోతే రాష్ట్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఏరియా నాయకులు నరేష్ ,రమేష్,సుదీప్ తదితరులు పాల్గొన్నారు.




## ఏడు సంవత్సరాల కేసును ఈరోజు కొట్టి వేసిన కరీంనగర్ కోర్ట్...




**కరీంనగర్ సెప్టెంబర్ 03:** ఏడు సంవత్సరాల నుండి నడుస్తున్న కేసును ఈరోజు కరీంనగర్ కోర్ట్ కొట్టి వేసింది, 12/12/2018 నాడు తెరాస ప్రభుత్వనికి నిరసనగా ముస్లింలకు 12% రిజర్వేషన్ ఇస్తానని మోసం చేస్తున్న ముఖ్యమంత్రి కాల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది, ముస్లింలకు తెరాస గెలిచినా ఆరు నెలలో తమిళనాడు తరహాలో ముస్లింలకు 12% రిజర్వేషన్ ఇస్తామని మోసం చేస్తున్న అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ దిష్టి బొమ్మను 12వ తేదీ 12వ నెల మధ్యాన్నం 12 గంటల 12 నిముషాలకు 12% శాతం రిజర్వేషన్ ఇవ్వనందుకు నిరసనగా తెలంగాణా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ పిలుపు మేరకు సీఎం కెసిఆర్ దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది, 7 సంవత్సరాల తర్వాత ఈరోజు కరీంనగర్ కోర్టు కేసు కొట్టివేసిందని. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ అన్నారు.

## హరీష్ రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులపై కవిత చేసిన ఆరోపణలు - అసత్యాలు, అపోహాలు

### - బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సంగారెడ్డి సెప్టెంబర్ 03 :** మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పై కవిత చేసిన ఆరోపణలు వాస్తవాల కంటే దూరంగా ఉన్నాయి. ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా చేసిన వక్రీకరణలు మాత్రమే.పార్టీ పెట్టిన్నాడు హరీశ్ రావు కేసీఆర్ వెంట లేనేలేరని వ్యాపారం చేసుకుందాం అని కేసీఆర్ తో అన్నారని, ఎనిమిది తొమ్మిది నెలల తరువాత తిరిగి పార్టీలోకి వచ్చి చేరితే కేసీఆర్ ఆయన్ను క్షమించి తీసుకున్నారని కవిత ఆరోపించారు. కానీ, 2001 ఏప్రిల్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యంలో టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకుంది. సుదర్శన్ రావు, నాయిని నర్సింహారెడ్డి, హన్మంతరావు, గాదె ఇన్నయ్య,వి.ప్రకాశ్,నిమ్మ నర్సిం హారెడ్డి, నారాయణరెడ్డి,గొట్టె భూపతి,మందాడి సత్యనారాయణరెడ్డి,హరీశ్ రావు తదితరులు ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్నారు.సుమారు ఏడాదికి పైగా జలదృశ్యం లోనే టీఆర్ ఎస్ పార్టీ కార్యకలాపాలు సాగాయి.పార్టీ పెట్టినప్పటి నుంచే కాదు హరీశ్ రావు పాలిటెక్నిక్ లో డిప్లోమా చేస్తున్ననాటి నుంచి కూడా కేసీఆర్ వెంటనే ఆయన ఛాయలాగా ఉన్నారు. ఆయనకు సంబంధించిన ఎన్నికలు సహా అన్ని కార్యక్రమాలను కూడా ఈయనే పర్యవేక్షించారు.పార్టీ జెండా తయారీ సమయంలో అందుకు కావలసిన రంగుల ఎంపిక కోసం బేగంబజార్ సుల్తాన్ బజార్ వెళ్లి కెసిఆర్ చెప్పిన రంగులను తెచ్చినది ఆనాటి ఉద్యమకారులు ఇంకా మరువలేదు. జలదృశ్యంలో పార్టీ జండా గద్దెను కట్టే పని మొదలు అనేకపనులు పర్యవేక్షించింది హరీశ్ రావే.కేసీఆర్ మాట జవదాటి ఒక్క అడుగు కూడా హరీశ్ రావు వేరేవైపు వెళ్లనే లేదు.ఒక సుశిక్షితుడైన సైనికుడిలాగా పనిచేశారు.కేసీఆర్ ఏ పని చెప్పినా ఎందుకు? అని అడుగకుండా ప్రతి పని కూడా చేశారు.ఉద్యమ సమయంలో ఎన్నిసార్లు రాజీనామా చేయాలని కేసీఆర్ ఆదేశించినా అన్నిసార్లూ రాజీనామా చేసి ఉద్యమ వేడిని రగిలించిన నేత హరీశ్ రావు. సిద్ధిపేటలో ఒక కళాశాల ఏర్పాటు గురించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని హరీశ్ రావు కలిసి ఒక వినతిపత్రం సమర్పించి వచ్చారు. అప్పుడు అక్కడే ఉన్న సీఎం పీఆర్వో హరీశ్ రావు చేతికి బొకేను ఇచ్చి ముఖ్యమంత్రికి ఇప్పించారు. తాను వైఎస్ ను ఎందుకు కలిశానో ఆ వెంటనే సచివాలయంలోని మీడియా పాయింట్ లో ప్రెస్ మీట్ పెట్టి మరీ హరీశ్ రావు చెప్పారు కూడా.కానీ ప్రత్యర్థులు ఆ ఫొటో పట్టుకొని ఆయనపై ఈనాటికీ బురద జల్లడం మానలేదు.ఇప్పుడు కవిత కూడా కాంగ్రెస్ స్వరాన్నే బలంగా వినిపిస్తున్నారు.2018 చివరలో కవిత పోరు వల్లనే హరీశ్ రావును కేసీఆర్ కొంతకాలం కుటుంబ రాజకీయాలకు దూరం ఉంచారు.2018 ఎన్నికల తరువాత వెంటనే క్యాబినెట్ లోకి తీసుకోకపోయినప్పటికీ ఆయన మౌనంగా ఉన్నారే తప్ప ఒక్క మాట కూడా మాట్లాడలేదు.హరీశ్ రావుకు ఏ బాధ్యత ఇచ్చినా ఒకే రకమైన అంకితభావంతో పనిచేస్తారనడానికి పదేండ్ల ఆయన పనితీరును దగ్గరినుంచి గమనించిన వారికి తేలిగ్గానే అర్థమవుతుంది. నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన ముందున్న అతి పెద్ద సవాలు కాళేశ్వరం. కాళేశ్వరం ప్రాజెక్టుపై నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఉన్న అంచనాలను అందుకోవడమే పెద్ద సమస్య. ప్రతి రోజు ఆయన ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష చేసేవారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలలో నిర్మాణం పూర్తిచేయడం కంటే ముఖ్యమైన సమస్యలు అనేక రకాల విభాగాల నుంచి అనేక రకాల అనుమతులు సాధించడం. అంతర్రాష్ట్ర సమస్యలు, భూసేకరణ, విద్యుత్తు పరిమితుల పరిష్కారం, గోదావరి ప్రవాహ పర్యవేక్షణ.. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటూ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకోవడానికి అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, అక్కడి అటవీశాఖ మంత్రులను కలవడానికి 25 సార్లకు పైగానే మహారాష్ట్రకు హరీశ్ రావు వెళ్లాల్సి వచ్చింది. అన్ని సమస్యలను పూర్తి చేసుకొని మూడున్నర సంవత్సరాలలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశారు.కేసీఆర్ నీటిపారుదల శాఖ ను అప్పగిస్తే ఆ శాఖ లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేసి ఆ రంగంలో కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించారు.ఆరోగ్య శాఖను అప్పగిస్తే.. అందులోనూ విప్లవాత్మకమైన మార్పులను తీసుకొని వచ్చారు. ఆర్థిక శాఖను అప్పగిస్తే.. దాన్ని కూడా అత్యంత సమర్థంగా నిర్వహించారు.ఎమ్మెల్యే కాకుండా మంత్రి పదవిని ఇచ్చారంటే.. అందుకు కారణం హరీశ్ రావు సమర్థతే. కేసీఆర్ స్వయంగా ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. రాజకీయాల్లో వారసత్వం అనేది ఊరకే రాదు.. ఎవరికి వారు ఒక ప్రాసెస్ లో ఎదిగి రావాల్సిందేనని అందుకు ప్రత్యక్ష ఉదాహరణ హరీశ్ రావు. ఉప ఎన్నికల ద్వారా మొదటిసారి ఎమ్మెల్యే అయిన హరీశ్ రావు ఇప్పటివరకూ అజేయంగా గెలుస్తూ వస్తున్నారు.ఈటల రాజేందర్ పై పగ పెంచుకొని.. ఆయన్ను పార్టీ నుంచి వెళ్లగొట్టారని అన్న కవిత అదే ఈటలను హుజూరాబాద్ లో హరీశే గెలిపించారని అనటం అర్థం లేనిది.ఎప్పుడో గజ్వేల్ ఉప ఎన్నికల ప్రచారం సందర్భంగా ఒంటేరు ప్రతాపరెడ్డి తన ప్రత్యర్థిపై చేసిన రాజకీయ ఆరోపణల వీడియో క్లిప్ ను కాంగ్రెస్ వాళ్లు తెరమీదకు తీసుకొని వస్తే దాన్ని పట్టుకొని కేసీఆర్ ను ఓడించడానికి హరీశ్ రావు కుట్ర చేశారని ఆరోపించడం ఎనిమిదో వింత. ఇప్పటికి ప్రతాప్ రెడ్డి బి ఆర్ ఎస్ లోనే ఉన్నారు.ఆయనను అడిగితే వాస్తవాలు చెప్తారు.రేవంత్ కాళ్లమీద పడి హరీశ్ రావు సరెండర్ అయ్యారని ఆరోపించడం వెర్రి తనమే. హరీశ్ రావు లాంటి వ్యక్తి ఏం జరిగినా క్యారెక్టర్ ను మాత్రం చంపుకునే వ్యక్తి కాదు. విషయాన్ని కూలంకషంగా అవగాహన చేసుకొని వెళ్లితేనే ఆయన దగ్గర మాట్లాడటం అన్నది సాధ్యపడుతుంది. పార్టీ ప్రారంభం కావడానికి ముందునుంచే కేసీఆర్ తో కలిసి నడిచారు కాబట్టి కేసీఆర్ అంటే ఏమిటో.. ఆయన నాయకత్వం ఏమిటో.. ఆయనతో కలిసి పనిచేయడం ఎంత అద్భుతమైదో తెలుసుకొని ఆచరించి నిలబడిన వాడు హరీశ్ రావు. హరీశ్ రావు నిజాయితీని శంకించడం అంటే సూర్యుడిలో మచ్చను వెతకడం వంటిదే. తాను ఎన్నిసార్లు వివరణలు ఇచ్చుకున్నా.. ప్రత్యర్థులతో పాటు, విలేఖరులు కూడా పదే పదే ఆయన నిజాయితీని ప్రశ్నిస్తుండటం వికృత రాజకీయాలకు పరాకాష్ట. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పడం ద్వారా నిజం చేయాలనే ప్రయత్నం చేయడం హరీశ్ రావు విషయంలో గత పదిహేనేళ్లుగా జరుగుతూనే ఉన్నది. కానీ, ఆయన నిజాయితీని, చిత్తశుద్ధిని అంగుళం కూడా పక్కకు జరుపలేకపోయారు. సోషల్ మీడియాలో ఎంత ట్రోల్ జరిగినా, ఎన్ని గాసిప్ లు సృష్టించినా ఆయన బెదరలేదు. చెదరలేదు. ఎందుకంటే ఆయనకు తన వ్యక్తిత్వం ప్రధానం. దాని హననం చేయడాన్ని ఎంతమాత్రం సహించని వ్యక్తి హరీశ్ రావు.కవిత మాటలు వింటే, అవి కాంగ్రెస్ పార్టీ మైక్ నుంచి వినిపిస్తున్నట్టే ఉన్నాయి. కాంగ్రెస్ బలహీనపడటంతో, ఇప్పుడు బీఆర్ఎస్‌పై అబద్ధపు ఆరోపణలు వేయించడానికి ఇదే వేదికగా వాడుకుంటున్నట్టు స్పష్టమవుతోంది ప్రకటనలో తెలిపారు.



## వర్క్ ప్లేస్ - స్ట్రాంగ్ వర్క్ ఫోర్స్ పేరుతో ఇంటరాక్టివ్ టాక్



**ప్రొద్దుటూరు సెప్టెంబర్ 03:-**మండలంలోని గోపవరం వెటర్నరీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం సేఫ్ వర్క్ ప్లేస్ స్ట్రాంగ్ వర్క్ ఫోర్స్ అనే థీమ్ పై మహిళా బోధన, బోధనేతర సిబ్బందితో ఇంటరాక్టివ్ టాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోష్ చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, ఉద్యోగ స్థలంలో గౌరవం, భద్రత అవసరమని తెలియజేశారు. మహిళా సిబ్బంది చురుకుగా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకుంటూ, హరాస్మెంట్ రహిత వాతావరణం కోసం తమ కట్టుబాటును ప్రదర్శిచారు.

## ఎస్సారైటి విద్యార్థులకు ఉద్యోగాలు



**ప్రొద్దుటూరు సెప్టెంబర్ 03:-** మండలంలోని లింగాపురం గ్రామంలోని సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ టాప్ ఎడ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారు బీటెక్ ఫైనల్ ఇయర్ అన్ని బ్రాంచుల వారికి సాఫ్ట్వేర్ డెవలపర్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో సి ఎస్ ఈ బ్రాంచ్ నందు 1.బి. వెంకట శ్రావణి 2. డి.శ్రేయ 3. ఆర్. చైతన్య లక్ష్మి 4. కె. ఎం. జాఫర్ 5. ఏ. గురు జోష్న, ఈసిఈ నందు 1. ఎన్. శాలిని 2. ఏ. తేజున్నిస 3.సి.మోహన్ కృష్ణ ఈఈఈ నందు 1.సి. ఈశ్వర్ రెడ్డి2.ఎస్. మహమ్మద్ అన్సర్ మొత్తం పదిమంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి బుధవారం తెలిపారు. ఎంపికైన వారికి మూడు నెలలు శిక్షణ అనంతరం ఏడాదికి మూడు నుండి నాలుగు లక్షల వేతనం ఇవ్వబడుతుందని టి.పి.ఓ సునీల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి మరియు హెచ్.ఓ.డి లు, అధ్యాపకులు అభినందించారు.

## కడపలో స్త్రీశక్తి విజయోత్సవ సభ

**● పోలీట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే మాధవి రెడ్డి**



**కడప సెప్టెంబర్ 03:-** కడప నగరంలోని అక్కాయపల్లి వద్ద ఉన్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ ప్రాంగణంలో సూపర్ సిక్స్ - సూపర్ హిట్ లో భాగంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పాల్గొన్నారు. అనంతరంనాయకులు మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం, సాధికారత కోసం ప్రారంభించిన స్త్రీశక్తి పథకం కడపలో విజయవంతంగా అమలవుతుండటం గర్వకారణమని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం వలన కుటుంబ ఆర్థిక భారం తగ్గిందని, ఇది నిజమైన స్త్రీ సాధికారతకు నిదర్శనమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకుంటాం

**● ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి**



**పత్తికొండ సెప్టెంబర్ 03:-** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలుచోట్ల దోమల బెడద ఎక్కువైందని, వీటి వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా పట్టణంలో పలుచోట్ల దోమల నియంత్రణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నామని గ్రామపంచాయతీ ఈవో, డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు తెలిపారు. బుధవారం పత్తికొండ పట్టణంలోని 1వ వార్డు నుంచి 11 వ వార్డు వరకు వీధులన్నింటిలోనూ ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే కస్తూర్బా పాఠశాలలో సైతం నిలువున్న నీటి ప్రాంతాల వద్ద ఫాగింగ్ పట్టారు. ప్రజలు కూడా ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వల్ల ఆరోగ్యాలు దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. పట్టణంలో పై తెలిపిన వార్డులలోరెండు ఫాగింగ్ మిషన్ల ద్వారా ఫాగింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



**వేంపల్లె సెప్టెంబర్ 03:-** తెలుగు బాషను ప్రజల్లో పెంపోందించే భాగంలో తెలుగు శాఖ యూనివర్సిటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ లలో యూనివర్సిటీ పరీక్షలలో అవుట్ స్టాండింగ్ గ్రేడ్ సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడానికి తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ నాగలక్ష్మి దేవి తన సొంత ఖర్చులతో విద్యార్థులను ప్రోత్సహించడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర పేర్కొన్నారు. ఇలాంటి సంప్రదాయాలను ప్రతి విభాగం చేపట్టితే విద్యార్థుల్లో మరింత ఉత్సాహం వస్తుందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు కూడ ప్రతిభ చూపిన విద్యార్థులను అదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగ లక్ష్మి దేవి, డాక్టర్ బాలకొండ గంగాధర్, గ్రంథాలయ శాఖ అధిపతి మాధవరావు, డాక్టర్ మల్లేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్ కుటుంబ సభ్యుల వల్లే రైతులకు దక్కని గిట్టుబాటు ధర

**ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**



**కడప సెప్టెంబర్ 03:-** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యుల వల్లే పులివెందులలో రైతులు పండించిన చీని, అరటి పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి విమర్శించారు. వైయస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రములో ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందని మంగళవారం పులివెందులలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ఆరోపణ లను తీవ్రంగా ఖండించారు. పులివెందులలో జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యాపారస్తులను బెదిరించి వారి దగ్గర నుంచి మామూలు వసూలు చేయడం వల్లే రైతులు పండించిన చీనీ అరటి పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. పైగా అక్కడ వ్యాపారస్తులు అవలంబిస్తున్న సూట్ విధానం వల్ల కూడా రైతులు నష్టపోతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టన్ను చీనీ ధర 47,500 పలుకగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టన్నుకు 48,500 ధర పలికిందన్నారు. ఇన్ని సంవత్సరాలుగా పులివెందులలో సూట్ విధానాన్ని అరికట్టి రైతులకు మేలు ఎందుకు చేయలేకపోయారని ఆయన ప్రశ్నించారు. దళారులనుంచి రైతులను ఎందుకు కాపాడలేకపోయారని నిలదీశారు. ఉల్లికి కూడా కనీస మద్దతు ధర ను క్వింటాల్ కు 1200 రూపాయలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశం ఇచ్చారన్నారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎటువంటి కొడతలేదని, ఎక్కడా అధిక ధరలకు బ్లాక్ మార్కెట్ లో విక్రయించడం లేదని పేర్కొన్నారు. 2024వ సంవత్సరం ఖరీఫ్ లో 19వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా 18 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేశామన్నారు. ఈ సంవత్సరం 20వేల మెట్రిక్ టన్నులు అవసరం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాకు రాగా ఇప్పటివరకు 12,350 మెట్రిక్ టన్నులను సరఫరా చేసామని మరో కొద్ది రోజుల్లో జిల్లాకు 8వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని తెలిపారు. రైతుల అవసరాన్ని బట్టి యూరియా అడిగిన రెండు మూడు రోజుల లోనే రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. జగన్ మోహన్ రెడ్డి రైతుల సమస్యలు, శాంతిభద్రతల సమస్యలపై రోడ్లమీదకు వచ్చి మాట్లాడకుండా అసెంబ్లీ సమావేశాలకు హాజరై అక్కడ సమస్యలను లేవనెత్తాలని ఆయన సూచించారు. ఈనెల 18 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు హాజరై పులివెందుల ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో టిడిపి మీడియా కోఆర్డినేటర్ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి గట్టి బందోబస్తు చర్యలు

**● నిమజ్జనం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు**



**కర్నూలు సెప్టెంబర్ 03:-**గణేష్ నిమజ్జనం సజావుగా సాగేలా గట్టి చర్యలు తీసుకున్నా మని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారంనిమజ్జన ఊరేగింపు మార్గాలు, గణేష్ నిమజ్జన వినాయక ఘాట్ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించారు.జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.పోలీసులు కేటాయించిన నిమజ్జన రూట్ లోనే ఊరేగింపు వాహనాలు వెళ్ళాలన్నారు. వినాయక ఉత్సవాల్లో ఆఖరు ఘట్టమైన గణేష్ నిమజ్జనం జిల్లా కేంద్రంలో సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు తెలిపారు.భద్రత ఏర్పాట్ల గురించి ఆరా తీశారు.కెసి కెనాల్ , వినాయక్ ఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.గణేష్ నిమజ్జనం సంధర్భంగా వినాయక విగ్రహాలు బయలుదేరే మొదటి రాంబోట్ల దేవాలయం, బాదం మాస్క్ , కింగ్ మార్కెట్ , కొండారెడ్డి బురుజు , అంబేద్కర్ సర్కిల్, రాజ్ విహార్ మీదుగా వెళ్లే వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రాంతాలను పరిశీలించారు.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ గారు పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. వీపరీతమైన హోరెత్తించే సౌండ్ తో ఉండే డిజేలకు నిమజ్జనానికి అనుమతి ఉండదన్నారు. పరిమితి సౌండ్ మాత్రమే ఉండాలన్నారు.కర్నూలు పట్టణం నుండి నిమజ్జనానికి వచ్చే వినాయక విగ్రహ వాహన డిజేలను రాజ్ విహార్ మీదుగా గవర్నమెంట్ హాస్పిటల్ - ఎన్టీఆర్ విగ్రహం సర్కిల్ వరకు మాత్రమే డిజేలకు అనుమతి ఉంటుందనీ, నిమజ్జన ఘాట్ వరకు లేదన్నారు.నంద్యాల చెక్ పోస్టు వైపు నుండి వచ్చే వినాయక విగ్రహ వాహన డిజేలను గాయత్రి ఎస్టేట్ క్లాక్ టవర్ వరకు మాత్రమే డిజేలకు అనుమతి ఉంటుందనీ, నిమజ్జన ఘాట్ వరకు అనుమతి లేదన్నారు. అర్ధరాత్రి 12 దాటిన తర్వాత ఎలాంటి డిజేలకు అనుమతి లేదన్నారు. పోలీసు శాఖ తోపాటు, మునిసిపాలిటి, రెవెన్యూ, ఇరిగేషన్, ఎక్సైజ్, విద్యుత్ , అగ్నిమాపక శాఖలతో సమన్వయంతో అందరూ పని చేస్తున్నామన్నారు. బ్యారికేడింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లను, లైటింగ్ ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు ఎవరూ కూడా పోలీసుల నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. పోలీసులు కేటాయించిన నిమజ్జన రూట్ లోనే ఊరేగింపు వాహనాలు వెళ్ళాలన్నారు. వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయంలో వర్షం ఎక్కువగా పడి ఇబ్బందులు ఎర్పడితే వినాయక్ ఘాట్ కు రాకుండా మీ ఏరియాలలో పోలీసు , రెవిన్యూ శాఖలు ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాలలో వెళ్ళి విగ్రహాలను నిమజ్జనం చేయవచ్చున్నారు. నిమజ్జనం సంధర్భంగా కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్ళింపు చేపట్టామని, వాహనదారులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహాకరించాలని కోరారు.గణేష్ నిమజ్జనం సంధర్భంగా సెప్టెంబర్ 4 వ తేది గురువారం ఉదయం 10 గంటల నుంచి గణేష్ నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు నగరంలో ట్రాఫిక్ ను మళ్లించినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. అత్యవసర ( 108, ఫైర్ , అంబులెన్సులు, పోలీసు వాహనాలు) సేవల కోసం పోలీసు వారితో అనుమతి పొందిన వాహనాలు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తారు. కర్నూలు ఆర్టీసి బస్టాండ్ నుండి రాజ్ విహార్ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, వినాయక్ ఘాట్, గాయత్రి ఎస్టేట్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి ఉండదు. వాహనాల రాక, పోకల నిషేధం ఉంటుంది. కర్నూలు ఆర్టీసి బస్టాండ్ నుండి ఆర్టీసి బస్సులు, ఇతర వాహనాలను బళ్ళారి చౌరస్తా మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్ , బిర్లా జంక్షన్ , మద్దూర్ నగర్ సర్కిల్ , సి. క్యాంపు మీదుగా నంద్యాల చెక్ పోస్టు వైపు వాహనాల రాక, పోకలు ఉంటాయని తెలిపారు.ఆత్మకూరు, నంద్యాల, నందికోట్కూరు, నంద్యాల చెక్ పోస్టు వైపు నుండి నగరంలోనికి వచ్చే వాహనాలు సి. క్యాంపు, బిర్లాగేట్ , గుత్తి పెట్రోల్ బంక్ నుండి కల్లూరు చెన్నమ్మ సర్కిల్ , బళ్ళారి చౌరస్తా మీదుగా కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకుంటాయని,హైదరాబాద్, గద్వాల, అలంపూర్ నుండి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి , సంతోష్ నగర్, బళ్ళారి చౌరస్తా మీదుగా కర్నూలు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి,అనంతపురం, డోన్ నుండి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు, బళ్ళారి చౌరస్తా మీదుగా కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ చేరుకుంటాయి.నిమజ్జనం పూర్తయిన తర్వాత నిమజ్జన వాహనాలు దేవనగర్ మీదుగా కృష్ణ నగర్ ,కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళతాయి.జిల్లా ప్రజలు, మతపెద్దలు, రాజకీయ పార్టీలు, యువత , మిడియా కర్నూలు నిమజ్జన ఉత్సవ కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు సహాయ సహాకారాలు అందించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీతో పాటు కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్, సిఐలు తేజోమూర్తి, కేశవరెడ్డి, నాగరాజా రావు, మన్సురుద్దీన్, శేషయ్య, పార్థసారథి పాల్గొన్నారు.

# విద్య. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా చెన్నూరుకు ఉత్తమ కార్యకర్తల అవార్డులు



**చెన్నూరు సెప్టెంబర్ 03:-** కమలాపురం లో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని విద్య ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ పర్యటించిన విషయం తెలిసిందే ఇందులో భాగంగా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె గ్రామ సమీపంలో జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమన్వయం సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఉత్తమ కార్యకర్తల అవార్డులను మంత్రి నారా లోకేష్ అందజేశారు. చెన్నూరు మండలానికి చెందిన ఉత్తమ కార్యకర్తలుగా కల్లూరు విజయభాస్కర్ రెడ్డి. ఆవుల పవన్ కుమార్ రెడ్డి .ముల్లా శ్రీనివాసులు రెడ్డి .వేల్పుల సుబ్రహ్మణ్యం. జడ లక్ష్మీనారాయణ. చిన్నయ్య. అధికారి విశ్వం. యామాల మణికంఠ .కాంతు ఓకేనా తిలకు .పవన్ కుమార్. రమణ. అనేకమంది ఉత్తమ కార్యకర్త అవార్డులను మంత్రి లోకేష్ చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గం ఇన్చార్జి పుత్త నరసింహారెడ్డి కమలాపురం శాసనసభ్యులు పుత్త కృష్ణ చైతన్య రెడ్డి ఇరువురిని మంత్రి నారా లోకేష్ అభినందించడమే గాక వారిరువురికి దీపికలు అందజేశారు.కమలాపురం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ యువగళంతో ఇచ్చిన లోకేష్ ఇచ్చిన ధైర్యమే ఇప్పుడు చెక్కుచెదరని పసుపు సైన్యంగా మారిందని కీర్తించారు. గత ఐదేండ్లు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, దాడులు చేసినా భయపడలేద న్నారు. కార్యకర్తలే టీడీపీ ఆస్తి అని వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికలకు ముందు లోకేష్ గారితో తనకు అంతగా పరిచయం లేదని, కానీ కమలాపురంలో యువగళం పాదయాత్ర సందర్భంగా ఆయనతో సాన్నిహిత్యం ఏర్పడిందని తెలిపారు. పాదయాత్రలో లోకేష్ నాయకత్వాన్ని చూశాక టీడీపీ భవిష్యత్తుకు ఢోకా లేదని అర్థమైందన్నారు. పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు కల్పించినా వెనకడుగు వేయలేదన్నారు. కడప జిల్లాలో యువగళం విజయమే రాష్ట్రంలో కూటమి గెలుపులో కీలక పాత్ర పోషించిందన్నారు.

# అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**● జడ్.పి.టి.సి కోకటం వెంకట బయపు రెడ్డి, ఎంపీపీ చల్ల గంగాదేవి వెంకటనారాయణలు ● సంవత్సరాలు గడుస్తున్న వితంతు పెన్షన్ల పెండింగ్ పై ఆగ్రహం వ్యక్తపరిచిన జడ్పిటిసి,ఎంపిపి ● ఎంపీపీ,జడ్పీటీసీ నిధులతో పలు అభివృద్ధి పనులు ● వేములలో "సర్వసభ్య సమావేశం"లో పలు అంశాలపై చర్చించిన ఆయాఅధికారులు.**




**వేముల సెప్టెంబర్ 03:-** మండలంలో విధులు నిర్వహించే ప్రతి ఒక్క అధికారి కూడా అర్హులైన ప్రజలకుపార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ అలా చేయని పక్షంలో వారిపై చర్యలు తప్పవని జడ్.పి.టి.సి కోకటం వెంకట బయపు రెడ్డి,ఎంపీపీ చల్ల గంగాదేవి వెంకటనారాయణలు పేర్కొన్నారు.బుదవారం ఉదయం వేముల మండల కేంద్రంలోనీ స్థానిక మండల ప్రజా పరిషత్ సభాభవనం నందు ఇంచార్జ్ ఎంపిడిఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకటనారాయణ అధ్యక్షతనలో మండల ప్రజా పరిషత్ "సర్వసభ్య సాధారణ సమావేశం" నిర్వహించారు.అందులో భాగంగా జడ్పిటిసి,ఎంపీపీ లు మాట్లాడుతూ..మండలంలోని అన్ని గ్రామాలల్లో ఎంపీపీ,జడ్పీటీసీ నిధులతో పలు అభివృద్ధి పనులకు ప్రత్యేక చొరవ తీసుకుని పనులుచేస్తున్నట్లు వివరించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సర్పంచ్ లు ఎంపీటీసీలు మండలలోని అన్ని పంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.సంవత్సరాలు గడుస్తున్న అర్హులైన వారికి వితంతు పెన్షన్ల ను అధికారులు అమలు చెయ్యలేకపోవడం శోచనీయమన్నారు.ముఖ్యముగా త్రాగునీరు,స్కూల్ లు అంగన్వాడీ కేంద్రాలకు,హాస్టల్ లకు మౌలిక సదుపాయాలు కల్పించాలనీ అధికారులను ఆదేశించారు.ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ మధుసూదన్ రెడ్డికి సూచించారు.గ్రామాలలో వీధిలైట్లు మరమ్మతులు చేయాలని ఆయా అధికారులకు ఆదేశించారు.ప్రతి అధికారి తప్పకుండా సమయ పాలన పాటించాలని ఎవరైనా సమయ పాలన పాటించ కుండా విధులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.వ్యవసాయ అధికారి జి.పి ఓబులేసు మాట్లాడుతూ..రైతు సోదరులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని,రైతులకు సబ్సిడీ ద్వారా డ్రిప్పు స్పింక్లర్స్ అందిస్తున్నట్లు తెలిపారు.ఎక్కడ అయిన రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తె వెంటనే పరిస్కరిస్తాము అని సంబంధిత రెవిన్యూ అధికారీ తెలిపారు.ఆర్డబ్ల్యు ఏస్ ఏ.ఈ రమేష్ రెడ్డి మాట్లాడుతూ..ఎక్కడ అయిన తాగునీరు సమస్య ఉంటే తమ దృష్టికి తీసుక రావాలని కోరారు.మండల పంచాయతీ రాజ్ ఏఈ అబ్దుల్లా మాట్లాడుతూ..మండలంలో వివిధ నిధులతో చేపట్టిన పనుల వివరాలను సభదృష్టికి తీసుకువచ్చారు.ఏ.పి.యం ఆంజనేయులు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరికి డ్వాక్రా రుణాలు విరివిగా అందిస్తాం అని,అలాగే సబ్సిడీ ద్వారా అందించే సోలార్ల ను ఉపయోగించుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలోవైస్ ఎంపీపీ నరసింహ రెడ్డి,నీలావతి,ఎంపీటీసీ లు,రామచంద్ర రెడ్డి బాబ్జాన్,లక్ష్మీదేవి,సర్పంచ్ లు నాగేళ్ల మహేశ్వర్ రెడ్డి,మూలి చెన్నారెడ్డి,నాగప్ప,అర్జున్,అధికారులు, వ్యవసాయ అధికారి ఓబులేష్, పి.ఆర్.ఏ.ఈ అబ్దుల్లా,ఏపీఎం ఆంజనేయులు,డాక్టర్ శరణ్య,ఐసిడిసి అధికారులు హసీనా,పంచాయతీ సెక్రటరీ లు మండల స్థాయి అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్



**కడప రూరల్ సెప్టెంబర్ 03:-**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా డాక్టర్ సి.యామిని, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ ఎస్. బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారు 13-09-2025 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్ న్యాయ సేవా సదన్ కడప నందు పోలీస్ అధికారులకు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు. పోలీసు స్టేషన్ల వారీగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరింత సమాచారం కొరకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: 08562 258622, 244622 ఈమెయిల్ అడ్రస్: districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@ gmail.com. అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రాజంపేట మనోజ్ హెగ్డే, కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఏ వెంకటేశ్వర్లు, రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం ఆర్ కృష్ణమోహన్, మైదుకూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి రాజేంద్రప్రసాద్, ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పి భావన, కడప కోర్టు మానిటరింగ్ సెల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌లో అందే అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు

**అధికారులు అంకిత భావంతో పనిచేయండి**

**భాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంతో విధులు నిర్వర్తించాలి: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి**

**కడప సెప్టెంబర్ 03:-** అర్జీదారులు, ఫిర్యాదుదారుల పట్ల భాధ్యతాయుతంగా, సహనంతో,సానుకూల దృక్పథంలో స్పందించ గలిగినపుడే.. ప్రజల సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించగలరని,ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతా యుతంగా వారి విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్ లోని సభాభవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎస్డీసి వెంకటపతి, జెడ్పి సీఈవో ఓబులమ్మ లతో కలిసి.. ఆయా డివిజన్ల ఆర్డీఓలు, అన్ని మండలాల తహాశీల్దార్లు, ఎంపిడిఓలు, సంబందిత శాఖల జిల్లా అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులుఅందుతున్నాయని.. వచ్చిన ఫిర్యాదులకు సరైన పరిష్కార నివేదికలు కూడా అందడం లేదన్నారు. సంబందిత మండల తహాశీల్దార్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పట్ల విచారణ జరగాలన్నారు. పరిష్కార నివేదిక అందివ్వడంలో.. పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన,సూటి సమాధానం ఇవ్వాలన్నారు. తద్వారా అర్జీ దారునికి సంతృప్తి స్థాయిలో పరిష్కారం అందే దిశగా అధికారులు పని చేయాలన్నారు..ఈ విషయం లో జిల్లా శాఖాధిపతులు, తహాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండాలనన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి వారి వారి కార్యాలయ వ్యవస్థను అందుకు అనుగుణంగా సిద్ధం చేసుకుని నిర్ణీత గడువు లోపల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత తో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సత్ఫలితాలు లభిస్తుందన్నారు. అనంతరం.. ఆయా శాఖల వారీగా ఫిర్యాదుల పెండింగ్ పై సమీక్షించి.. పూర్ పర్ఫార్మెన్స్ రికార్డు నమోదైన అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని శాఖలల్లో ఫిర్యాదుల పెండెన్సీ నమోదుకు వచ్చే నెల లోపు "0" స్థాయిలోకి వచ్చేలా... పునఃపరిశీలించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే..శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. మండల స్థాయి అధికారులతో ప్రతివారం, జిల్లా స్థాయిలో 15 రోజులకు ఒకసారి పెండెన్సీని పూరించేందుకు



సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విధి నిర్వహణ లో వర్చువల్ గవర్నెన్స్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి విజిట్ కు వెళ్లేముందు ముందస్తు ప్రణాళికతో వెళ్లాలని, అవసరమనుకున్న చోట ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించాలని తద్వారా.. మంచి ఫలితాలను అందుకోగలం అన్నారు. జిల్లా యొక్క జిఎస్ డిపి ప్రమాణాలను పెంచే విధంగా అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖల పరంగా ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను.. నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు.అనంతరం.. పబ్లిక్ గ్రీవిన్స్ రీ అడ్రసల్ సిస్టమ్ లో భాగంగా శాఖల వారీగా చేపట్టవాల్సిన కార్యక్రమాల ప్రణాళికలు, కర్తవ్యాల గురించి.. పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా జేసీ క్షుణ్ణంగా వివరించారు.ఈ కార్యక్రమంలో నాలుగు అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ల ఆర్ డి ఓ లు, తహాసీల్దార్ లు,మున్సిపల్ కమిషనర్లు,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సౌమ్యనాథ స్వామి వారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



**తిరుపతి సెప్టెంబర్ 03:-** అన్నమయ్య జిల్లా నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామి వారి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, యాగశాలలో పుణ్యాహవచనం, కుంభ ఆరాధన, ప్రధాన హెూమములు జరిగాయి. యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. మూలవర్తకు, ఉత్సవర్లకు, విష్వక్సేన, ద్వారపాలకులు, భాష్య కార్లు, గరుడాళ్వార్, బలిపీఠం ధ్వజస్తంభం, ప్రధాన కుంభానికి, పరివార దేవతలకు పవిత్రాలు సమర్పించారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం యాగశాల లో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్లు దిలీప్ ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పిల్లల సంరక్షణ, రక్షణ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి




**కర్నూలు సెప్టెంబర్ 03:-** పిల్లల సంరక్షణ మరియు రక్షణ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అన్నారు. నల్సా పిల్లల కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పై వర్క్ షాప్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్థి సూచనల మేరకు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి బుధవారం కర్నూలు న్యాయ సేవా సదన్లో సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ లతో పిల్లల కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2024 పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పిల్లల సంబంధిత గవర్నమెంట్ విభాగాలతో సమన్వయం చేసుకొని పిల్లల సంరక్షణ మరియు రక్షణ బాధ్యతలను నిర్వహిస్తుందని తెలిపారు. అందరి సహకారంతో నల్సా పిల్లల కోసం స్నేహపూర్వక న్యాయ సేవలను విజయవంతంగా అమలు చేద్దామని, మరియు ప్రతి బిడ్డ గౌరవం సంరక్షణ మరియు న్యాయంతో పెరిగే వాతావరణాన్ని సృష్టిద్దామని తెలిపారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ అయిన శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని తెలిపారు. రిసోర్స్ పర్సన్ కర్నూలు డిజేబులిటీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ రైస్ ఫాతిమా మాట్లాడుతూ వైకల్యాలు ఉన్న మరియు వైద్య చికిత్స అవసరమైన పిల్లలను గుర్తించి వారికి వైద్య చికిత్సలు అందేలా చేస్తామని తెలిపారు. నంద్యాల అడిషనల్ డిస్టిక్ అండ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ శారదాబాయి మాట్లాడుతూ వైద్య మరియు ఆరోగ్య శాఖ డైస్ కేంద్రాలు మరియు జాతీయ ఆరోగ్య మిషన్ తో సమన్వయం చేసుకొని అవసరమైన పిల్లలకు సరైన చికిత్స మరియు మందులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ మాట్లాడుతూ బడికి వెళ్ళని పిల్లలను గుర్తించి వారిని బడులలో చేర్పిస్తామని తెలిపారు, పిల్లలకు ఎవరికైనా సమస్యలుంటే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి కాల్ చేయాలని కోరారు. జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాసర రెడ్డి మాట్లాడుతు బడికి వెళ్ళని పిల్లలను గుర్తించి జడ్పీ స్కూల్స్ లో చేర్పిస్తామని తెలిపారు. ఈ సమావేశం లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు, గవర్నమెంట్ అబ్జర్వేషన్ హెూం సూపరింటెండెంట్ హుస్సేన్ బాషా,కర్నూలు డైస్ సెంటర్ మేనేజర్ ఇర్ఫాన్ భాష, డిస్టిక్ ఇమ్మునైజేషన్ ఆఫీసర్ నాగప్రసాద్, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, మున్సిపల్ అధికారులు, జిల్లా పరిషత్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, డిజేబులిటీ డిపార్ట్మెంట్ అధికారులు, హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, ఉమ్మడి జిల్లాల మండల విద్యాధికారులు, ప్యానల్ లాయర్లు, ప్యారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో అవినీతిపరులు ఎవరో తెలపాలి




**ప్రొద్దుటూరు సెప్టెంబర్ 03:-** మున్సిపాలిటీలో అవినీతిపరులు ఎవరో తెలపాలని 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తాను ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయలేదని తెలిపారు. తాను గతంలో పలుమార్లు ఖాజాకు తన వంతు సహకరించానని కానీ ఏనాడైనా ఒక్క రూపాయి తీసుకుని వుంటే తెలిపాలని ప్రశ్నించారు. ఖాజా తమతో పాటు అసమ్మతి వర్గంలో వున్నప్పుడు రాచమల్లు పై చేసిన విమర్శలు గుర్తు లేవా అని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కాంట్రాక్ట్ లు లెస్ వేయాలని ఎమ్మెల్యే, తాము తెలిపితే వైసీపీ కౌన్సిలర్లు ప్రతిఘటిస్తున్నారని, గతంలో వైసీపీ పాలనలో అన్ని టెండర్లు హై కే వేశారని వివరించారు. తనపై విమర్శలు చేసే ముందు వైస్ ఛైర్మన్ ఖాజా మున్సిపల్ బకాయిలు చెల్లించి, తనపై ఆరోపణలు శివాలయం సెంటర్ కు వచ్చి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నూరీ, తలారి పుల్లయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వవాహనంపై శ్రీ రంగనాథుని దర్శనం

**పులివెందుల సెప్టెంబర్ 03:-** పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో నూలుపూజ ఉత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు సోమయ్య పల్లె కృష్ణ రాజేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యల హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈవో కొట్టే వెంకటరమణ, ధర్మకర్తలు, ఉభయ దారులు పాల్గొన్నారు.



# అవినీతి కారణంగా బిఆర్‌ఎస్ అంతర్ధానం!

బిఆర్‌ఎస్‌లో అవినీతి ఉందని, పాలనను అడ్డంపెట్టుకుని అందరూ బాగా సంపాదించారని కవిత వ్యాఖ్యల వల్ల మరింత స్పష్టం అయ్యింది. హరీష్ రావు, సంతోష్ రావులు బాగా సంపాదించారని కవితే స్వయంగా ఆరోపిస్తున్నారు. వారే మీడియాను ఆడిస్తున్నారని కూడా చెప్పారు. కెసిఆర్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే వారి లక్ష్యం అని కూడా ఆమె చెప్పారు. మొత్తంగా ఇదంతా బిఆర్‌ఎస్‌లో అంతర్గత సమస్యలకు కారణంగా చూడాలి. అన్నింటికీ మించి కెసిఆర్ కేవలం ఫామ్‌హౌజ్‌కే పరిమితంకావడం, అధికారం పోగానే ప్రజల్లోకి రాకపోవడం వల్ల పార్టీ పతనానికి చేరిందని చెప్పాలి. అధికారం ఉండగా అవినీతిలో మునిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాలరాశారు. అధికారం, డబ్బుతో విర్రవీగారు. తాను అచేతనంగా మారడంతో సమస్యలు వస్తున్నాయని ఇప్పుడు కెసిఆర్ గుర్తించడం లేదు. తాను కట్టిన కాళేశ్వరం సకల సమస్యలకు సమాధానమని చెప్పిన నేత, దానిని ఎదుర్కొనేందుకు ముందుకు రాలేదు. అసెంబ్లీకి ముఖం చాటేశారు. ఇదంతా కేవంల ఏడాదిన్నరలో పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే దశకు చేరుకోవడానికి కేవలం కెసిఆర్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. నాయకుడు అన్న వాడు ఎప్పుడూ ఉత్సాహంగా ముందుకు సాగాలి. అవినీతిని ఎదుర్కోవాలి. అధికారం ఉంటే అనుభవించవమే కాదు...అవమానాలు వచ్చినా ధైర్యంగా నిలబడాలి. అప్పుడే నేతగా ప్రజలు గుర్తిస్తారు. కవిత వ్యవహారంతోఇప్పుడు బిఆర్‌ఎస్ అవినీతి పతాక స్థాయిలో కనిపిస్తోంది. అనేక పథకాల ద్వారా పార్టీలో ఉన్నవారు ఎంతగా సంపాదించారో ప్రజలకు అర్థం అయ్యింది. ప్రాంతీయ పార్టీలు అన్నీ తట్టుకుని నిలబడగలగాలంటే నేత అన్నవాడు గట్టిగా ఉండాలి. కానీ కెసిఆర్ తనకు నచ్చిన విధంగా ఉంటూ వచ్చాడు. అధికారం ఉన్నప్పుడు నడిచింది. కానీ ఇప్పుడు నడవదు. అందుకే బిఆర్‌ఎస్ మనుగడ అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా మూడు దశాబ్దాల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు ఇంకా అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తనను జైలులో వేసినా గట్టిగా నిలబడి కొట్లాడాడు. పార్టీలో కార్యకర్తలకు, నేతలకు ధైర్యం ఇచ్చాడు. తరిగి పార్టీని అధికారంలోకి తీసుకుని వచ్చే వరకు విశ్రమించలేదు. ఇది చంద్రబాబు పట్టుదలకు తార్కాణంగా చూడాలి. చంద్రబాబుతో పోలిస్తే వయసులో చిన్నవాడైనా కెసిఆర్ అంతగా ఏనాడూ నిలబడలేకపోయారు. ఇకపోతే ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాయన్నది ప్రధానం కాదు. అవసరార్థం అది కామన్‌గా జరుగుతూనే ఉంటుంది. కాదనుకుంటే వదిలేస్తుంటారు. చంద్రబాబులాగా కరుణానిధి, మమతా బెనర్జీ, జయలలిత కూడా బీజేపీతో నూ కాంగ్రెస్ తోనూ సంబంధాలు ఏర్పర్చుకున్నవారే. అయినా వారు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టి రాజకీయం నెరప లేదు. వారు ప్రజల్లో ఉంటూనే రాజకీయం చేశారు. ఏది జరిగినా ఓటమిని అంత సులభంగా అంగీకరించే వారు కారు. పట్టుబట్టి మళ్లీ గెలవడానికి సర్వశక్తులు ఒడ్డేవారు. ఆ తెగువ కేసీఆర్‌లో కనిపించడం లేదు. ప్రజలకు అసవరమైతే వారే ఓటేస్తారని భావించే రకంగా కెసిఆర్ ఉంటున్నారు. అందుకే ఆయన పార్టీ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తెలంగాణ రాష్ట్ర సమితి




ఏర్పడ్డ లక్ష్యాలకు, ఆశయాలకూ దూరం కావడంతో పాటు, కెసిఆర్ నేల విడిచి సాము చేయడం వల్ల పార్టీ ఈ దుస్థితిని ఎదుర్కొంటుందన్నది ముమ్మాటికి నిజం. కవితను బయటకు పంపడం ద్వారా ఓ రకంగా పార్టీకి మరిన్ని సంక్షోభాలు తెచ్చుకున్న ట్లుగానే గుర్తించాలి. అలాగే పార్టీ అవినీతి పాలన చేసిందన్న వాదనకు కవిత వ్యాఖ్యలు బలం చేకూర్చాయి. హరీష్ రావు, సంతోష్‌లపై అవినీతి మరకలు వేసినా అవి నేరుగా కెసిఆర్‌కే తాకాయని గుర్తించాలి. ప్రాంతీయ నాయకులకున్న స్థిరత్వం, లక్ష్యశుద్ధి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేసీఆర్ దగ్గర లేకపోవడం కూడా ఇందుకు కారణంగా చూడాలి. అధికారం వస్తే అనుభవించండ లేకుంటే వదిలేయడం అన్న తార్కిక ధోరణిలో కెసిఆర్ ఉండడం కూడా పార్టీ పతనానికి కారణంగా చూడాలి. తెలంగాణ ప్రజల్లో, ముఖ్యంగా సామాజికంగా బలహీనవర్గాల్లో ఆకాంక్షలు పెరిగిపోయిన క్రమంలో జయశంకర్, కోదండరాం వంటి అనేక మంది నేతలు నిర్మించిన ఉద్యమం ఆయన రాజకీయంగా బలపడేం దుకు తోడ్పడింది. కానీ దానిని ఆయన గుర్తించలేదు. జయశంకర్ సార్ ఎన్ని అవమానాలు ఎదురైనా ఓర్మితో భరించారు. ఇక కోదండరామ్‌తో పాటు అనేకమంది ఉద్యమకారులను కెసిఆర్ మెడపట్టి గెంటేశారు. అసోంలో అస్సాం గణపరిషత్ కూడా ఇలాగే పతనం అయ్యింది. ప్రాంతీయ పార్టీల్లో వారసులు ఉండడం, తండ్రి తరవాత వారు పెత్తనం చేయడం సహజం. మమతా బెనర్జీకి కూడా మేనల్లుడు వారసుడిలా వెన్నంటి ఉన్నారు. కాని ఆ పార్టీలేవీ వారసుల మూలంగా అంతర్గత సంక్షోభంలో చిక్కుకోలేదు. ములాయం, లాలూప్రసాద్, కరుణానిధి, శిబూ సోరెన్‌ల వారసులే ఆ తర్వాత ముఖ్యమంత్రులయ్యారు. పైగా వారి బంధువులు కూడా పార్టీల్లో, పదవుల్లో కీలక స్థానాలు పోషించారు. జయలలిత ఉన్నప్పుడు నెచ్చెలి శశికళ పెత్తనం చేశారు. కానీ పార్టీని దెబ్బతీయలేదు. కాంగ్రెస్‌లో కూడా రాహుల్, ప్రియాంక ఎంత సన్నిహితంగా, ఎవరి బాధ్యతలు వారు నెరవేరుస్తూ, అధికారం కోసం చెమటోడుస్తున్నారు. కానీ బీఆర్‌ఎస్ కుటుంబసభ్యుల వల్ల దెబ్బతింటున్నదని గట్టిగా చెప్పానికి కవిత సస్పెన్షన్ కారణంగా చూడాలి. కేసీఆర్ పార్టీని గాలికి వదిలేయడం, ప్రజల్లోకి రాకపోవడం, చుట్టోటరీల ప్రభావానికి లోను కావడం వల్ల కవితను దూరం చేసుకోవడంతో పాటు, ఇంటిగుట్టును రోడ్డున పడేసుకున్నారు. కెసిఆర్ అప్రమత్తంగా, జాగ్రత్తగా లేకపోవడం వల్ల, సరైన మార్గదర్శకత్వం అందించపోవడం వల్ల, ఎవరి పాత్ర ఏంటన్నది నిర్దేశించకపోవడం వల్ల ఇప్పుడు కోలుకోలేని దెబ్బతిన్నారనే చెప్పాలి. కెసిఆర్ విషయాన్ని గ్రహించరు...ఎవరైనా ఏమైనా చెబితే అర్థం చేసుకోరు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలనని ఆశించిన కెసిఆర్ అలా ప్రచారం చేసుకున్న తీరు కూడా ఆయనలోని నాయకత్వ లోపాన్ని ఎత్తి చూపింది. ఫాంహౌజ్‌లో ఉంటూ పూర్తిగా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం సాధ్యం కాదని తెలుసుకోలేదు. ఇంటిని చక్కదిద్దుకోలేక ఇప్పుడు ప్రజల్లో అభాసు పాలయ్యారు. ఇంటిగుట్టును బయటపెట్టుకున్నారు. కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల్లో అవినీతిపై విచారణ జరుగుతున్న వేళ దానిని ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలం కావడం కూడా కెసిఆర్ నాయకత్వ లోపానికి నిదర్శనంగా చూడాలి. అలాగే తనచుట్టూ రాజకీయంగా ఆలోచనలు చేసి చెప్పే అనుభవజ్ఞులను దూరం చేసుకున్నారు. కేవలం అధికారం, డబ్బు సంపాదన మత్తులో తెలంగాణను ఆగం చేసిన పార్టీగా బిఆర్‌ఎస్ మిగిలిపోయింది. త్వరలో అంతర్ధానం అయినా ఆశ్చర్యం లేదు.

# నా ఆరోగ్యం బాగానే ఉంది..

## పుకార్లను నమ్మకండి..

## మీడియా ముందు ప్రత్యక్షమైన ట్రంప్



**న్యూయార్క్,సెప్టెంబర్3:**ట్రంప్ ఆరోగ్యంగా లేరంటూ అమెరికా అధ్యక్షుడు అనారోగ్యంగా ఉన్నారని సోషల్‌మీడియాలో ఇటీవల రకరకాల ప్రచారాలు జరిగాయి. కొద్దిరోజులుగా ట్రంప్ బహిరంగంగా కనిపించకుండా ఉండటంతో తీవ్ర సందేహాలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. పైగా ఆయన కుడిచేతిపై గాయాలతో కనిపించడం ఈ అనుమానాలను మరింత పెంచింది. వీటన్నింటిపై తాజాగా ట్రంప్ స్పందించారు. తాజాగా ఓవల్ ఆఫీసులో మీడియా ముందుకొచ్చిన ఆయన.. వాటన్నింటినీ ఫేక్ న్యూస్ అని ఆయన కొట్టిపారేశారు. చాలా రోజుల తర్వాత మంగళవారం నాడు మీడియా ముందుకు వచ్చిన ట్రంప్‌ను కొంతమంది రిపోర్టర్లు ఆయన ఆరోగ్యంపై ప్రశ్నించారు. ' మీరు చనిపోయారని సోషల్‌మీడియాలో వార్తలు వచ్చాయి.' వాటి గురించి తెలుసా అని అడిగారు. దీనికి ట్రంప్ స్పందిస్తూ.. అవునా, నేను చనిపోయానని వార్తలు వస్తున్నాయా నాకు తెలియదు అంటూ వ్యంగ్యంగా బదులిచ్చారు. అవన్నీ వట్టి పుకార్లే అని అని గుర్తించారుగా అని సమాధానం ఇచ్చారు. ఈ వీకెండ్‌లో చాలా ఆరోగ్యంగా ఉన్నానని, వర్జీనియా గోల్ఫ్ క్లబ్‌లో గోల్ఫ్ ఆడానని చెప్పారు. అంతేకాదు 'ట్రూత్' సోషల్‌లో శనివారం నుంచి సోమవారం వరకు 90కి పైగా పోస్టులు కూడా చేశానని వివరించారు. రెండు రోజుల పాటు- తాను ఎలాంటి మీటింగ్‌లు పెట్టలేదని.. అందుకే ఇలాంటి వదంతులు వచ్చాయని పేర్కొన్నారు. గత వారంలో చాలా ప్రెస్‌మీట్‌లు పెట్టాను.. అవన్నీ సక్సెస్ అయ్యాయి. ఆ తర్వాత రెండు రోజుల పాటు- మీటింగ్‌లు పెట్టకపోవడంతో.. ఏదో జరిగిందని అనుకున్నారని వివరించారు. ఇక గత అధ్యక్షుడు జో బైడెన్‌ను కూడా ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. బైడెన్ అయితే నెలల తరబడి పబ్లిక్ మీటింగ్‌లు పెట్టకుండా ఉండేవాడని.. అయినా ఎవరూ ఆయన ఆరోగ్యం గురించి ఏమీ అనలేదని అన్నారు. కానీ ఆయన ఆరోగ్య పరిస్థితి అంత గొప్పగా ఏమీ లేదని చెప్పారు. డోనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై వైట్‌హౌస్ వైద్యులు ఇప్పటికే వివరణ ఇచ్చారు. ట్రంప్ చేతిపై కనిపిస్తున్న మచ్చకు ఆయన తీసుకుంటు-న్న ఆస్పిరిన్ మందే కారణమని తెలిపారు. హ్యాండ్‌షేక్ ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆయనకు ఆ మచ్చలు వస్తాయని.. అవి మళ్లీ మాయమవుతాయని పేర్కొన్నారు. ఇక క్రానిక్ వీనస్ ఇన్‌సఫీషియన్సీ కారణంగా ఆయనకు కాళ్ల వాపులు వచ్చాయని చెప్పారు. అవన్నీ సర్దుకున్నాయని చెప్పారు.




# హద్దులు దాటుతున్న విదేశాంగ విధానం

ఏడేళ్ల తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ చైనా పర్యటనకు వెళ్లడం, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశం కావడం పట్ల మొత్తం ప్రపంచం ఆసక్తిగా గమనించింది. దీనిని భారత్ దౌత్య విజయంగా చెప్పుకున్నప్పటికీ, ఈ శిఖరాగ్ర సమావేశం మోడీ విదేశాంగ విధానంలో ఒక ఇబ్బందికరమైన నమూనాను వెల్లడిస్తుంది. ఇది భారతదేశ వ్యూహాత్మక ప్రయోజనాల కంటే అంతర్జాతీయంగా వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకొనే ప్రయత్నంగా పలువురు చూస్తున్నారు. మొదటి నుండి అంతర్జాతీయ ప్రాముఖ్యత కోసం మోడీ పడుతున్న తపన అందరికీ తెలిసిందే. విదేశీ పర్యటనల ద్వారా ఆయన భారత్‌కు ఎటువంటి ప్రయోజనం చేకూరుస్తున్నారో గాని, అందుకోసం వెచ్చిస్తున్న వనరులు అన్ని రికార్డులనూ అధిగమిస్తున్నాయి.'విశ్వగురు' వాక్చాతుర్యంతో భారతదేశ సార్వభౌమత్వాన్ని ప్రాంతీయ పరిస్థితుల విషయంలో రాజీపడే విధంగా వ్యవహరిస్తున్నారా అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. విదేశాంగ విధాదాన్ని ఓ ప్రజాసంబంధాల ప్రక్రియ స్థాయికి కుదించి, వ్యూహాత్మక ఎత్తుగడలకు ఆస్కారం లేకుండా చేస్తున్న ధోరణులు కనిపిస్తున్నాయి. చైనా పర్యటనకు కొద్దీ రోజులముందు చైనా 'వన్ నేషన్ పాలసీ'కు ఆమోదం తెలపడం ద్వారా తైవాన్‌ను ఆ దేశం ఆక్రమించుకొనేందుకు భారత్ ఆమోద ముద్ర వేసినట్లయింది. 1950లలో టిబెట్ ను చైనా ఆక్రమించుకోవడాన్నీ గుర్తించడం ద్వారా నెహ్రూ ప్రభుత్వం ఎటువంటి ఘోరమైన వ్యూహాత్మక తప్పిదం చేసిందో ఇప్పుడు కూడా అటువంటి పొరపాటు వైపు పయనిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం అవుతున్నది.

# బీహార్ ఇసికి ఇదో అగ్నిపరీక్ష

బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పుల దరఖాస్తులను గడువు ముగిసిన తరువాత కూడా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పు జాబితా నుంచి మినహాయించిన ఓటర్లకు ఒక అవకాశంగా పేర్కొనవచ్చు. దీనికి స్పందనగా ఎన్నికల కమిషన్ కూడా గడువు తరువాత వచ్చిన అభ్యంతరాలను, మార్పులు, చేర్పులను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే వాటిని ఓటర్ జాబితా ఖరారైన తరువాతనే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. నామినేషన్ల దాఖలు చివరి తేదీ వరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీం కోర్టుకు ఎన్నికల కమిషన్ తెలియజేసింది.ఇది స్వాగతించదగిన చర్య. దీనివల్ల జాబితా నుంచి మినహాయింపు పొందిన ఓటర్లు తమ ఆధార్ కార్డు ద్వారా జాబితాలో తిరిగి చోటు పొందవచ్చు. అయితే ఎన్నికల కమిషన్ వెల్లడించిన సంఖ్యలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఫారమ్ 6 ఉపయోగించి కొత్తగా 15 లక్షల మంది ఓటర్లు నమోదు కాగా, తొలగించబడిన 65 లక్షల ఓటర్లలో కేవలం 33,000 ఓటర్లే తమను తిరిగి చేర్చుకోవాలని దరఖాస్తులు చేయడం గమనార్హం. ఈ భారీ వ్యత్యాసం ఈ రెండు కేటగిరీ ఓటర్లు ఫారం 6 నే ఉపయోగించడంతో కోర్టుకు సమర్పించిన డేటాలో గందరగోళానికి దారితీసింది. దీంతో ఎన్నికల కమిషన్‌కు, రాజకీయ పార్టీలకు మధ్య పెద్ద వివాదం చోటుచేసుకుంది. జాబితా నుంచి మినహాయించిన ఓటర్లకు సహకరించడంలో పార్టీలు విఫలమయ్యాయని ఎన్నికల కమిషన్ వాదిస్తోంది. తాము అభ్యంతరాలను సమర్పించినా బ్లాక్ స్థాయి అధికారులు సరిగ్గా పరిశీలించడం లేదని పార్టీలు ఆరోపిస్తున్నాయి. అవకతవకలపై తమ పార్టీకి చెందిన బూత్‌స్థాయి ఏజెంట్లు ఎన్నికల సంఘానికి 89 లక్షల ఫిర్యాదులు సమర్పించారని, కానీ వాటన్నిటినీ ఎన్నికల కమిషన్ తిరస్కరించిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేడా ఆరోపించారు.ఈ సవాళ్లను గమనించిన సుప్రీంకోర్టు బీహార్‌లోని ఓటర్లుకు, పార్టీలకు సహకరించడానికి పారా లీగల్ వాలంటీర్లను వినియోగించుకోవాలని బీహార్ రాష్ట్ర లీగల్ సర్వీస్‌కు మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిపై రహస్య నివేదికను జిల్లా జడ్జిలకు సమర్పించాలని ఆ వాలంటీర్లకు ఆదేశించింది. ఈ విధంగా కోర్టు జోక్యం చేసుకోవడం డేటా ఆధారిత పరిశోధనలను ప్రతిబింబిస్తుంది. అలాగే జాబితాలోంచి ఓటర్ల మినహాయింపులో అసాధారణ పద్ధతులను అవలంబించారని ఆంగ్లపత్రిక కథనం వెలువడడం కూడా సుప్రీం కోర్టు గమనించింది. తొలగించిన ఓటర్ల వివరాలను ఎన్నికల కమిషన్ సమర్పించగా వాటిని పరిశీలిస్తే ఎన్నో లోపాలు కనిపించాయని ఆ పత్రిక తన అధ్యయనంలో పేర్కొంది. పోలింగ్ స్టేషన్లవారీగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. 80 పోలింగ్ స్టేషన్ల పరిధిలో యువత మరణాలే



అత్యధికంగా ఉన్నాయని ఎన్నికల కమిషన్ పేర్కొం ది. 127 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల తొలగింపులో లింగ వ్యత్యాసం భారీగా కనిపించింది.7216 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అత్యధిక మరణాలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. 973 పోలింగ్ కేంద్రాల పరిధిలో నూటికి నూరు పాళ్లు మృతులైన ఓటర్లే జాబితానుంచి తొలగించబడ్డారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. 5084 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల గైరుహాజరు అత్యధికంగా నమోదైంది. 663 పోలింగ్ కేంద్రాల పరిధిలో మహిళా ఓటర్లు శాశ్వతంగా మరో ప్రాంతానికి తరలిపోయినట్టు గుర్తించడమైంది. క్షేత్రస్థాయి అధ్యయనాలే ఈ పొరపాట్లను ఎత్తి చూపాయి. భారీ ఎత్తున పొరపాట్లను సవరించడం తప్పనిసరి. సంకుచిత రాజకీయాలకు అతీతంగా, వాస్తవంగా తొలగింపబడిన అసలు సిసలైన ఓటర్లకు సహాయంగా రాజకీయ పార్టీలు క్రియాశీలకంగా వ్యవహరించవలసిన బాధ్యత ఉంది. భాగస్వాములందరి నుంచి అటువంటి పౌర బాధ్యత ప్రజాస్వామ్య ప్రక్రియలో అవసరం.ఇక ఎన్నికల కమిషన్ కూడా తన బాధ్యతలను పకడ్బందీగా నెరవేర్చక తప్పదు. ముసాయిదా జాబితాలోంచి తొలగించబడ్డ ఓటర్లలో 99.5% మందిని ఆధార్ ప్రామాణిక ధ్రువపత్రంగా పరిగణించాలి. మినహాయింపు పొందిన ఓటర్లు తమ ఆధార్ కార్డు తగిన ప్రూఫ్‌గా తమ అభ్యంతరాలను సమర్పించవచ్చు. ఇప్పటికే ముసాయిదా జాబితాలో ఉన్న ఓటర్లకు అధికారికంగా ఇది సరిపోతుంది. బీహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనుభవం భవిష్యత్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు పాఠంగా ఉపయోగపడుతుంది. దీర్ఘకాలం పాటు విస్తరించిన ఓటర్ల జాబితాల సమగ్ర సవరణకు అనుకూలంగా ఎన్నికల కమిషన్ తన సాంకేతిక పరిజ్ఞానాన్ని, అతి స్వల్ప గడువు విధానాన్ని, ఎన్నికల కమిషన్ నిషేధించవలసిన అవసరం ఉంది. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను తనిఖీచేసే విధానాన్ని అవలంబించాలి.అంతే తప్ప ఆదరాబాదరాగా ఓటర్ల జాబితాల ప్రక్రియను చేపడితే స్వచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా తయారు కాదు. దానివల్ల ఓటర్ల హక్కుల కన్నా పరిపాలనా సౌలభ్యానికే ప్రాధాన్యం ఇచ్చినట్టు అవుతుంది. ఇదిలా ఉండగా బీహార్‌లో మహాగఠ్ బంధన్ ఆధ్వర్యంలో లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్ర ఓట్ల చోరీ దొల్లతనాన్ని బయటపెట్టింది. ఓట్ల చోరీపై త్వరలో కాంగ్రెస్ పార్టీ హైడ్రోజన్ బాంబును పేల్చబోతోందని రాహుల్ హెచ్చరించారు.

# బెంగళూరు బుల్స్‌కు వరుసగా రెండో ఓటమి



విశాఖలోని పోర్టు స్టేడియంలో ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్లో భాగంగా దబాంగ్ ఢిల్లీ, బెంగళూరు బుల్స్ మధ్య జరిగిన మ్యాచ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 41-34 తేడాతో బెంగళూరు బుల్స్‌పై అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఢిల్లీ ఈ సీజన్లో తమ మొదటి విజయాన్ని సాధించగా.. బెంగళూరు బుల్స్‌కు ఇది వరుసగా రెండో ఓటమి. దబాంగ్ ఢిల్లీ కెప్టెన్ అశు మాలిక్ ఈ మ్యాచ్‌లో 15 పాయింట్లతో అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ ఆరంభం నుంచే ఢిల్లీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మూడో నిమిషంలో 2-1 ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ఢిల్లీ డిఫెన్స్ 'డూ ఆర్ డై' రైడ్‌లో బుల్స్ రైడర్ ఆకాష్ షిండేను ఔట్ చేసి తమ బలమైన వ్యూహాన్ని చూపించింది. ఐదో నిమిషంలో అశు మాలిక్ చేసిన సూపర్ రైడ్‌తో ఢిల్లీ స్కోర్ 6-1కి పెరిగి బెంగళూరు బుల్స్‌ను ఆలౌట్ చేసే దిశగా నెట్టింది. సూపర్ టాకిల్ సమయంలో కూడా అశు మాలిక్ పాయింట్లు సాధించాడు. అనంతరం ఢిల్లీ డిఫెన్స్ అద్భుతంగా పనిచేసి 10-3 ఆధిక్యం సాధించింది. ఢిల్లీ ఆలౌట్ తర్వాత కూడా పాయింట్లు సాధిస్తూ ఆధిక్యాన్ని 12-3కి పెంచుకుంది. అయితే యోగేష్.. అశు మాలిక్‌ను ఔట్ చేయడంతో బెంగళూరు బుల్స్ కొంత ఊరట పొందింది. కానీ ఢిల్లీ జట్టు ఆటగాడు నీరజ్ మళ్లీ ఆధిక్యాన్ని 8 పాయింట్ల తేడాతో నిలబెట్టాడు. హాఫ్‌టైమ్ సమయంలో 21-11 ఆధిక్యంలో నిలిచింది. రెండో సగంలో అశు మాలికత్ మరోసారి బుల్స్‌ను ఆలౌట్ చేసి ఢిల్లీకి 28-13 ఆధిక్యం తెచ్చి పెట్టాడు. చివరి ఐదు నిమిషాల్లో బుల్స్ పోరాటం కొనసాగించినప్పటికీ.. అప్పటికే ఆలస్యం కావడంతో పాయింట్ల తేడాను పూడ్చలేకపోయింది. దీంతో దబాంగ్ ఢిల్లీ 41-34 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఢిల్లీ జట్టులో నీరజ్ నర్వాల్(7), ఫజల్ అత్రాచలి, సౌరవ్ నందల్(చెరో 3 పాయింట్లు) కూడా బాగా ఆడారు. మరోవైపు బెంగళూరు బుల్స్‌లో ఆకాష్ షిండే(3) నిరాశపరిచాడు. అయితే ఆకాష్ మాలిక్(8), అలీరేజా మీర్‌జైన్(10) కొంత మెరుగైన ప్రదర్శన కనబరిచారు.

విశాఖపట్నంలోని పోర్టు స్టేడియంలో జరిగిన ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్, మూడు సార్లు ఛాంపియన్ పట్నా పైరేట్స్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 39-36 తేడాతో విజయం సాధించింది. జైపూర్ జట్టు తరపున యువ రైడర్ నితిన్ కుమార్ ధంకర్ అద్భుతంగా రాణించి 13 పాయింట్లతో మ్యాచ్ స్టార్‌గా నిలిచాడు. అతనికి తోడుగా, తన పీకేఎల్ అరంగేట్రం చేసిన అలీ సమాది చౌబ్‌తారాష్ కూడా 8 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ ఆరంభంలోనే జైపూర్ ఆధిక్యం సాధించింది. నితిన్ కుమార్ రైడింగ్‌లో పాయింట్లు సాధించగా, నితిన్ రావల్, రోనక్ సింగ్, రెజా మిర్‌బఘేరి డిఫెన్స్‌లో రాణించారు. దీంతో మొదటి పది నిమిషాల్లోనే జైపూర్ 10-8 ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం రెజా మిర్‌బఘేరి చేసిన ఒక కీలకమైన టాకిల్‌తో జైపూర్, పట్నా పైరేట్స్‌ను ఆలౌట్ చేసి తమ ఆధిక్యాన్ని 21-16కి పెంచుకుంది. మరోవైపు, పట్నా పైరేట్స్ తరపున కెప్టెన్ మణిందర్ సింగ్ ఒంటరి పోరాటం చేసి 15 పాయింట్లతో మెరిశాడు. అతనికి సుధాకర్ మరుతుముత్తు (9 పాయింట్లు), అయాన్ లోచ్చబ్ మద్దతునిచ్చారు. రెండో అర్ధభాగంలో మణిందర్ సింగ్ తన సూపర్-10 పూర్తి చేసి పట్నాకు ఆశలు రేపాడు. అలీ సమాది చౌబతారాష్ తన వేగం, నైపుణ్యంతో జైపూర్ ఆధిక్యాన్ని ఆరు పాయింట్ల వరకు పెంచినప్పటికీ, మణిందర్ సింగ్ రెండు పాయింట్ల రైడ్‌తో ఆధిక్యాన్ని నాలుగు పాయింట్లకు తగ్గించి మ్యాచ్‌ను మరింత ఉత్కంఠగా మార్చాడు. చివరి వరకు పట్నా జట్టు పోరాడినప్పటికీ, నితిన్ కుమార్, అలీ సమాదిల నిలకడైన ప్రదర్శనతో జైపూర్ పింక్ పాంథర్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్ అభిమానులకు మంచి వినోదాన్ని పంచిపెట్టింది.

# సంబరాల్లో విషాదంపై విరాట్ కోహ్లీ ఎమోషనల్ పోస్ట్

క్రికెట్ ఆటకు భారతదేశంలో ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ మరెక్కడా లేదని చెప్పవచ్చు! ముఖ్యంగా యువతరం ఎంతో ఇష్టపడే క్రికెట్, జీవితంలో ఒక ఏమోషన్‌గా మారిపోయింది. IPLతో అభిమానం మరింత పెరిగింది. ముఖ్యంగా ఎన్నో ఏళ్ల ఎదురుచూపుల తర్వాత ఒక ఫ్రాంచైజీ ట్రోఫీ గెలిస్తే అది మరింత ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి సందర్భం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు 2024లో వచ్చింది. కానీ ఆ విజయ సంబరాలు విషాదంలో ముగిసాయి. కోట్ల మంది ఫ్యాన్స్ ఆనందంలో మునిగిపోతుంటే, చరిత్రలో నిలిచిపోయేలా ఒక దుర్ఘటన చోటుచేసుకుంది. ఇక ఆ ఘటనపై విరాట్ కోహ్లీ తాజాగా ఒక వివరణ ఇవ్వడం వైరల్ అవుతోంది. 2024 జూన్ 4న బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ తొలి ఐపీఎల్ ట్రోఫీ విజయోత్సవం జరిగింది. దాదాపు 2.5 లక్షల మంది అభిమానులు ఒకేచోట గుమికూడారు. ఆనందం, కేరింతలు, పాటలు అన్నీ నడుస్తున్న వేళ ఒక్కసారిగా నియంత్రణ తప్పింది. జనసంద్రంలో గందరగోళం ఏర్పడి తొక్కిసలాట జరిగింది. ఆ క్షణాల్లోనే 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. ఒక టీమ్ సెలబ్రేషన్స్‌తో పండుగ కావాల్సిన సందర్భం విషాద వాతావరణం సృష్టించింది. ఆ రోజు జరిగిన దుర్ఘటనపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. నివేదికల ప్రకారం, సరైన అనుమతులు లేకుండా భారీగా ప్రజలను ఆహ్వానించడం, తగిన సెక్యూరిటీ లేకపోవడం ప్రధాన కారణాలుగా తేలింది. సోషల్ మీడియా ద్వారా ఆర్సీబీ విస్తృతంగా ఫ్యాన్స్‌కి ఆహ్వానం పంపినందు వల్లనే జనాలు అధికంగా వచ్చారని అధికారులు చెప్పారు. పోలీసులు కూడా తక్కువ సంఖ్యలో ఉండటం వల్ల గుమికూడిన జనాన్ని కంట్రోల్ చేయలేకపోయారని అంగీకరించారు. ఫలితంగా ఫ్రాంచైజీనే బాధ్యత వహించాలని విమర్శలు వచ్చాయి. ఆర్సీబీలో ప్రధాన ఆటగాడిగా ఉన్న విరాట్ కోహ్లీ, ఆ ఉత్సవాల్లో ముఖ్య పాత్ర పోషించాడు. కానీ ఈ ఘటన తర్వాత ఆయన మనసు బరువెక్కింది. "మన ఫ్రాంచైజీ చరిత్రలో అత్యంత సంతోషకరమైన రోజు విషాదంగా మారింది. ఆ రోజు జీవితంలో మరచిపోలేని బాధ" అని అన్నారు. "ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం నేను ప్రార్థిస్తున్నాను. వారి నష్టం ఇప్పుడు మన జట్టు కథలో భాగం. ఇక నుంచి జాగ్రత్త, గౌరవం, బాధ్యతతో ముందుకు వెళ్తాం" అని కోహ్లీ అన్న మాటలు అభిమానుల హృదయాలను కదిలించాయి. ఈ విషాదం తర్వాత ఆర్సీబీ ఫ్రాంచైజీ వెంటనే చర్యలు తీసుకుంది. మరణించిన వారి కుటుంబాలకు 25 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. "ఆర్సీబీ కేర్స్" పేరుతో ఒక ఫౌండేషన్‌ను కూడా ప్రారంభించింది. దీని ద్వారా భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసే చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చింది. స్టేడియం అధికారులు, లీగ్ నిర్వాహకులు, పోలీసులు కలిసి భద్రతా మార్గదర్శకాలు కఠినంగా పాటించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని స్పష్టం చేసింది. ఆ రోజు జరిగిన విషాదం ఇంకా అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఒకవైపు తమ జట్టు విజయంపై గర్వం, మరోవైపు నిరపరాధుల ప్రాణనష్టం పై బాధ. ఇక విరాట్ కోహ్లీ స్పందన, ఆర్సీబీ చర్యలు అభిమానులకు కొంత ఊరటనిచ్చాయి. కానీ ఆ రోజు సంబరాల్లో కలిసిన కన్నీటి జ్ఞాపకం మాత్రం ఎప్పటికీ మరవలేనిది. ఇకనైనా ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి అని ఫ్యాన్స్ రిక్వెస్ట్ చేస్తున్నారు.



## అమాంతం బరువు తగ్గిన

# రోహిత్ శర్మ

భారత క్రికెట్ జట్టుకు అద్భుతమైన కెప్టెన్‌లలో రోహిత్ శర్మ ఒకరు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు చిరస్మరణీయ విజయాలు అందించి సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు. టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన హిట్‌మ్యాన్ 2027 ప్రపంచకప్ వరకు వన్డే క్రికెట్‌లో కొనసాగాలని భావిస్తున్నాడు. అనంతరం క్రికెట్ నుంచి వైదొలగాలననే ప్రణాళికలో రోహిత్ ఉన్నాడు. అతడి క్రికెట్ పక్కనపెడితే రోహిత్ శర్మ బరువు తగ్గాడనే వార్త వైరల్‌గా మారింది. ఏకంగా 20 కిలోల బరువు తగ్గాడని.. స్లిమ్ అయ్యాడని చర్చ జరుగుతోంది. కొంతకాలంగా రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై చర్చ జరుగుతోంది. రోహిత్ ఫిట్‌గా లేడని.. ప్రదర్శన పేలవంగా ఉందని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్ తర్వాత విరాట్, రోహిత్‌లను వన్డే జట్టు నుంచి తప్పించేందుకు బీసీసీఐ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 2027 ప్రపంచకప్ టోర్నీకి శుభ్‌మన్ గిల్ సారథ్యంలో జట్టు వెళ్తుందనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఫిట్‌నెస్ లేని రోహిత్ శర్మతో ఐసీసీ వన్డే ట్రోఫీ కష్టమనే అభిప్రాయం నేపథ్యంలో హిట్‌మ్యాన్ తన ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. 2024 శ్రీలంక వన్డే సిరీస్ పూర్తి చేయడానికి ముందు రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాడు. రోహిత్ శర్మ తన శరీరాన్ని తిరిగి ఫిట్‌గా మార్చుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాడని తెలుస్తోంది. ఇటీవల మాజీ కోచ్ అభిషేక్ శర్మతో కలిసి బెంగళూరులోని ఎన్‌సీఏలో జరిగిన ఫిట్‌నెస్ పరీక్షలో రోహిత్ శర్మ పాల్గొని ఉత్తీర్ణుడయ్యాడు. ఇప్పుడు అతను పూర్తి ఫిట్‌నెస్‌ను తిరిగి పొందాడనే వార్త అతడి అభిమానులను సంతోషపరుస్తోంది. ఈ క్రమంలో రోహిత్ శర్మ దాదాపు 20 కిలోల బరువు తగ్గాడని తెలుస్తోంది. 95 కిలోల నుంచి 75 కిలోలకు చేరాడని సమాచారం. ఇటీవల రోహిత్ శర్మ బయట కనిపించిన వీడియో వైరల్ గా మారింది.



# బిగ్‌బాష్ లీగ్‌లోకి అశ్విన్ ఎంట్రీ




భారత క్రికెట్‌లో ఇప్పటివరకు ఎంతోమంది లెజెండరీ ప్లేయర్స్ వేర్వేరు ఫార్మాట్లలో తమ ముద్ర వేశారు. కానీ ఐపీఎల్‌కి గుడ్‌బై చెప్పిన కొద్ది రోజుల్లోనే మరో అంతర్జాతీయ లీగ్‌లో అడుగుపెట్టే అవకాశాలు వస్తే ఎలా ఉంటుంది ఇదే ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో హాట్ టాపిక్ అయింది. రవిచంద్రన్ అశ్విన్ లాంటి లెజెండరీ బౌలర్ ఐపీఎల్ తర్వాత, భారీ క్రేజ్‌తో కొనసాగుతున్న ఒక విదేశీ లీగ్‌లో ఆడవచ్చని సమాచారం బయటకు రావడంతో ఆసక్తి మరింత పెరిగింది. ఒకవేళ ఇది నిజమైతే ఇండియన్ క్రికెట్ చరిత్రలో కొత్త కొత్త ట్రెండ్ ప్రారంభం అయినట్లే! ఇది అభిమానుల్లో ఆసక్తి, ఆత్రుతను పెంచుతోంది. అశ్విన్ పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది అతని మ్యాజికల్ ఆఫ్ స్పిన్. టెస్ట్ క్రికెట్‌తోపాటు, ఐపీఎల్‌లోనూ తన ప్రతిభను నిరూపించుకున్న ఈ ఆటగాడు ఎప్పుడూ సరికొత్త ట్రిక్స్‌తో ప్రత్యర్థులను కంగారు పెడతాడు. అశ్విన్ 2011 వరల్డ్ కప్ టీమ్‌లో కూడా ఉన్నాడు. తరువాతి దశల్లో భారత క్రికెట్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తరపున తన ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో తన అద్భుత ప్రదర్శనతో ఆయా జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 38 ఏళ్ల వయసులో కూడా క్రికెట్ పట్ల చూపుతున్న ప్యాషన్ నిజంగా ప్రేరణాత్మకం. క్రికెట్ వరల్డ్‌లో ఐపీఎల్ తర్వాత అత్యంత ఆదరణ ఉన్న టోర్నీ 'బిగ్‌బాష్ లీగ్'. క్రికెట్ ఆస్ట్రేలియా ఈ లీగ్‌ను ప్రతీ ఏడాది డిసెంబర్- జనవరిలో నిర్వహిస్తుంది. సాధారణంగా భారత ఆటగాళ్లు విదేశీ లీగుల్లో ఆడటానికి అనుమతి లేదు. అలా ఆడాలి అనుకుంటే పూర్తిస్థాయిలో ఇండియన్ క్రికెట్‌కు దూరం కావల్సిందే. బీసీసీఐ కి సంబంధించిన ఎలాంటి లీగ్స్, టోర్నీలలో ఆడటానికి వీలుండదు. అయితే అశ్విన్ ఇటీవల ఐపీఎల్ కు రిటైర్మెంట్ ఇచ్చాడు. దీంతో అతనికి ఫారిన్ లీగుల్లో ఆడేందుకు అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఫారిన్ లీగ్ ఫ్రాంచైజీల నుంచి అశ్విన్‌కు ఆఫర్లు వస్తున్నట్లు తెలుస్తోంది. రీసెంట్‌గా ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు సీఈఓ టాడ్ గ్రీన్‌బర్గ్ ఇప్పటికే అశ్విన్‌తో సంప్రదింపులు జరిపారని వార్తలు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ "అశ్విన్ లాంటి ఛాంపియన్ ఆటగాడు మా బిగ్‌బాష్ లీగ్ కి వస్తే ఆస్ట్రేలియా క్రికెట్‌కు లాభం" అని అన్నారు. అతడి అనుభవం, ప్రఖ్యాతి బీబీఎల్ స్థాయి పెంచుతుందని నమ్ముతున్నారు. కానీ సమస్య ఏమిటంటే, ఇప్పటికే ఎక్కువ జట్లు తమ బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించాయి. అందువల్ల ప్రత్యేక కాంట్రాక్టులు, స్పాన్సర్ ఆధారిత డీల్స్ ద్వారా అశ్విన్‌ను తీసుకోవాలని బోర్డు ప్రయత్నిస్తోంది. ఆటగాడిగా మాత్రమే కాకుండా కోచ్‌గా, క్రికెట్ అనాలిస్ట్‌గా కూడా అశ్విన్ తన భవిష్యత్‌ను నిర్మించుకోవాలని అనుకుంటున్నాడు. ఇప్పటికే తన పాడ్‌కాస్ట్‌ల ద్వారా అభిమానులతో నేరుగా కనెక్ట్ అవుతూ ఉన్నాడు. బీబీఎల్ లాంటి లీగ్‌లో ఆడటం ద్వారా కోచింగ్‌లోనూ కొత్త విషయాలు నేర్చుకోవచ్చని, మీడియా రోల్స్ లో కూడా అవకాశాలు వెతుక్కోవచ్చని భావిస్తున్నాడు. ఇది కేవలం ఒక లీగ్‌లో ఆడటమే కాకుండా, భవిష్యత్తులో క్రికెట్‌లోనే ఓ రోల్ సంపాదించుకోవచ్చు! ఇప్పుడు అభిమానుల మదిలో ఉన్న ప్రధాన ప్రశ్న, అశ్విన్ బీబీఎల్‌లో ఏ జట్టు తరపున ఆడతాడు మెల్బోర్న్ స్టార్స్ లేదా రెనిగేడ్స్ జట్లు అశ్విన్‌ను తీసుకోవచ్చని చెబుతున్నారు. ఇది జరిగితే బీబీఎల్‌కు దక్షిణాసియా మార్కెట్‌లో మంచి రెస్పాన్స్ ఉంటుంది. అతని అడుగులు ఇతర భారత ఆటగాళ్లకు కూడా మార్గం చూపే అవకాశం ఉంది. ఐపీఎల్ తర్వాత కెరీర్ కొనసాగించాలనుకునే వారికి ఇది ప్రేరణగా నిలుస్తుంది. మొత్తంగా చూస్తే, అశ్విన్ బీబీఎల్‌లో అడుగు పెడతాడా లేదా అనేది ఇంకా క్లారిటీ రాలేదు. కానీ ఆయన పేరు వినిపించడం కూడా లీగ్‌కు కొత్త ఊపు తీసుకువచ్చింది. ఇది ఒక ఆటగాడి వ్యక్తిగత ప్రయాణం మాత్రమే కాదు, భారత క్రికెట్ భవిష్యత్తులో ఒక కొత్త ట్రెండ్ కూడా కావచ్చు. అశ్విన్ అడుగులు ఇతర ఇండియన్ స్టార్లకు దారి చూపవచ్చు. మరి అతని నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.

## సోనీ బేకర్ పరమ చెత్త

# రికార్డ్ నమోదు

క్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో ఇంగ్లాండ్ యువ పేసర్ సోనీ బేకర్ అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టాడు. తన అరంగేట్రంలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచి సోనీ అవాంఛనీయ రికార్డును సృష్టించాడు. లీడ్స్‌లోని హెడింగ్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ కేవలం 131 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా ఐడెన్ మార్క్రామ్, ర్యాన్ రికెల్టన్ అద్భుతమైన బ్యాటింగ్ తో ఆకట్టుకున్నారు. ఐడెన్ మార్క్రామ్ చేసిన ఈ దాడితో సోనీ బేకర్ పూర్తిగా నిరాశ చెందాడు. ఫలితంగా, 22 ఏళ్ల ఈ ఫాస్ట్ బౌలర్ 7 ఓవర్లలో 76 పరుగులు చేశాడు. దీంతో, ఇంగ్లాండ్ తరపున వన్డే అరంగేట్రంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సోనీ బేకర్ అవాంఛనీయ రికార్డును కలిగి ఉన్నాడు. ఈ అవాంఛనీయ రికార్డు గతంలో లియామ్ డాసన్ పేరిట ఉండేది. 2016లో పాకిస్థాన్‌పై వన్డే అరంగేట్రం చేసిన డాసన్ 8 ఓవర్లలో 70 పరుగులు ఇచ్చాడు. దీంతో అరంగేట్రంలోనే అత్యధిక పరుగులు చేసిన ఇంగ్లీష్ బౌలర్‌గా నిలిచాడు. ఇప్పుడు, ఈ అవాంఛిత రికార్డును సోనీ బేకర్ సృష్టించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో సోనీ తన వన్డే కెరీర్‌ను చాలా పేలవమైన రికార్డుతో ప్రారంభించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 7 ఓవర్లలో 10.90 సగటుతో 76 పరుగులు ఇచ్చాడు.



గురువారం,
04 సెప్టెంబర్ 2025

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# పున్నమి సరస్సులో పుట్టిన వెన్నెల శిల్పం .. శ్రీనిధి శెట్టి!



వెండితెరపై విరిసిన కలువల మాదిరిగా చాలామంది అందమైన కథానాయికలు కనిపిస్తూ ఉంటారు. అందానికి ఉదాహరణలే తప్ప నిర్వచనాలు ఉండవు. ఎవరి అందం వారిది .. ఎవరి ప్రత్యేకత వారిది. విశాలమైన నేత్రాలతో మనసులు కొల్లగొట్టేవారు కొందరైతే, సంపెంగ మొగ్గలాంటి నాసికతో చూపులు కట్టిపడేసేవారు మరికొందరు. చక్కని మందహాసంతో మంత్రం వేస్తూ, ఆకర్షణీయమైన చీరకట్టుతో ఆకట్టుకునేది ఇంకొందరు.


అలా మంత్రముగ్ధులను చేసే అందమైన కథానాయికల జాబితాలో శ్రీనిధి శెట్టి కూడా కనిపిస్తుంది.

నాజూకుతనానికి నమూనాగా కనిపించే శ్రీనిధి శెట్టి, మోడలింగ్ వైపు నుంచి సినిమాలలోకి వచ్చింది. తొలి సినిమా 'కేజీఎఫ్'తోనే సంచలన విజయాన్ని అందుకుంది. అంతేకాదు ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. తన హైట్ వైపు నుంచి ఆమె ఎక్కువ మార్కులు కొట్టేసింది. ఎన్నో ఆఫర్లు ఆమె గుమ్మం ముందుకు తీసుకొచ్చిన సినిమా ఇది. అయినా ఆమె అంగీకరించిన ప్రాజెక్టులు చాలా తక్కువ.

'కోబ్రా' సినిమాతో కోలీవుడ్ కి పరిచయమైన శ్రీనిధి శెట్టి, ఆ తరువాత ' హిట్ 3' సినిమాతో తెలుగు తెరపైకి వచ్చింది. 'హిట్ 3' సినిమా మంచి వసూళ్లను రాబట్టింది. అంతే కాదు ఇక్కడ ఆమె అభిమానుల సంఖ్య పెరిగేలా చేయగలిగింది. ఆ తరువాత ఆమె తెలుగులోనే సిద్ధూ జొన్నలగడ్డ జోడీగా, 'తెలుసు కదా' అనే సినిమా చేసింది. నీరజ కోన దర్శకత్వం వహించిన ఈ సినిమా, అక్టోబర్ 17వ తేదీన థియేటర్లకు రానుంది.

ఈ నేపథ్యంలోనే ఆమె వెంకటేశ్ సరసన సందడి చేయనున్నట్టుగా కొన్ని రోజులుగా ఒక వార్త షికారు చేస్తోంది. వెంకటేశ్ - త్రివిక్రమ్ కాంబినేషన్ లో ఒక ప్రాజెక్టు పట్టాలెక్కింది. త్వరలోనే రెగ్యులర్ షూటింగు మొదలు కానుంది. ఇందులో ఇద్దరు కథానాయికలు ఉంటారట. ఒక కథానాయికగా శ్రీనిధి శెట్టిని తీసుకున్నారని వినికిడి. ఈ జోడీ చాలా బాగుంటుందని అంటున్నారు. అదే నిజమైతే, ఇక్కడ శ్రీనిధి జోరు కొనసాగడం ఖాయమేనని అనుకోవాలి.

# ఈ-కామర్స్ సంస్థలకు సోనాక్షి సిన్హా వార్నింగ్




తన ఫొటోలను అనుమతి లేకుండా వ్యాపార ప్రయోజనాల కోసం వాడుకుంటున్న కొన్ని ఈ-కామర్స్ సంస్థలపై బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన చిత్రాలను వెంటనే తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. తాను తరచుగా ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తుంటానని, ఆ సమయంలో కొన్ని ప్రముఖ వెబ్‌సైట్లలో తన ఫొటోలను చూసి షాక్ అయినట్లు సోనాక్షి తెలిపారు. తన అనుమతి కానీ, కనీసం సమాచారం కానీ లేకుండా తన వ్యక్తిగత ఫొటోలను వాణిజ్య ప్రకటనల కోసం వాడుకోవడం నైతికంగా సరైంది కాదని ఆమె అన్నారు. "ఏదైనా డ్రెస్ లేదా ఆభరణం నచ్చితే, ఆ బ్రాండ్ వివరాలతో సోషల్ మీడియాలో పోస్ట్ పెడతాను. అంతమాత్రాన నా ఫొటోలను మీ వెబ్‌సైట్‌లో పెట్టుకుని వ్యాపారం చేసుకుంటానంటే అస్సలు ఊరుకోను. వెంటనే నా ఫొటోలు తొలగించండి, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని తన పోస్టులో సోనాక్షి సిన్హా హెచ్చరించారు. సెలబ్రిటీల ఫొటోలను వారి అనుమతి లేకుండా వ్యాపారానికి వాడుకోవడం సరికాదంటూ సోనాక్షి తీసుకున్న ఈ స్టాండ్‌కు పలువురు నెటిజన్లు మద్దతు తెలుపుతున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, సోనాక్షి సిన్హా ఇటీవల 'నికితా రాయ్' అనే సైకలాజికల్ థ్రిల్లర్‌తో ప్రేక్షకులను పలకరించారు. ఆమె సోదరుడు ఖుష్ ఎన్ సిన్హా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అర్జున్ రాంపాల్, పరేశ్ రావల్ కీలక పాత్రలు పోషించారు. గతేడాది విడుదలైన 'హీరామండీ' వెబ్‌సిరీస్‌తో కూడా సోనాక్షి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

# బెల్లంకొండ 'కిష్కింధపురి' ట్రైలర్ వచ్చేసింది..



యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ థ్రిల్లర్ 'కిష్కింధపురి'. వినూత్నమైన టైటిల్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ చిత్రం ఇప్పుడు విడుదలకు సిద్ధమైంది. తాజాగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేయడంతో పాటు, సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఉత్కంఠభరితమైన సన్నివేశాలు, భయానకమైన విజువల్స్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ట్రైలర్ చివర్లో అనుపమ పరమేశ్వరన్ భయపెట్టే లుక్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బెల్లంకొండ తన పవర్‌ఫుల్ నటనతో మరోసారి మెప్పించబోతున్నారని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రానికి కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉండగా, 'కిష్కింధపురి' సినిమా సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకుంది. చిత్రంలోని తీవ్రమైన హారర్ సన్నివేశాల కారణంగా సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికేట్ జారీ చేసింది. సినిమా రన్‌టైమ్ 2 గంటల 5 నిమిషాలుగా ఖరారు చేశారు. ఒక హారర్ థ్రిల్లర్‌కు ఇది సరైన నిడివి అని, కథను ఎక్కడా సాగదీయకుండా ఉత్కంఠగా చెప్పేందుకు ఇది దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ అందిస్తున్న సంగీతం, నేపథ్య సంగీతం సినిమాలోని హారర్ మూడ్‌ను మరింత పెంచుతుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన 'కిష్కింధపురి' థియేటర్లలో ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుందో చూడాలి.




# ఈ సినిమాతో ప్రేక్షకులకు పాత రోజులు గుర్తుకు వస్తాయి

## : లిటిల్ హార్ట్స్ కథానాయకి శివానీ నాగారం

ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే అంశాలున్న సినిమా లిటిల్ హార్ట్స్ అని ఆ సినిమా కథానాయిక శివానీ నాగారం పేర్కొన్నారు. 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న శివానీ ఇటీవల 'లిటిల్‌హార్ట్స్' సినిమాలో నటించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ పతాకంపై సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మాతగా ఈ సినిమా రూపొందగా, బన్నీ వాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. లిటిల్ హార్ట్స్ ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా శివానీ నిన్న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సినిమా విశేషాలను పంచుకున్నారు. తాను మంచి కథ కోసం ఎదురు చూస్తున్న సమయంలో చిన్నప్పటి స్నేహితుడైన సంగీత దర్శకుడు సింజిత్ ఈ సినిమా కథ గురించి చెప్పినపుడు, ఆ తర్వాత దర్శకుడు సాయిమార్తాండ్ ఈ కథ వినిపించినపుడు తనకు కళాశాల రోజులు గుర్తుకువచ్చాయన్నారు. ఇందులోని ప్రతి పాత్రనీ చాలా బాగా డిజైన్ చేశారన్నారు. హాస్యం ప్రధానంగా, సరదా ప్రేమకథతో ఈ సినిమా సాగుతుందన్నారు.

# రాజమౌళిపై కెన్యా మంత్రి ప్రశంసల వర్షం



భారత్‌కు తిరుగుపయనమైన రాజమౌళి చిత్ర బృందం ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం »%SSMB% 29'. ఈ సినిమాకు సంబంధించి ఒక కీలకమైన అప్‌డేట్‌ను కెన్యా విదేశాంగ శాఖ మంత్రి ముసాలియా ముదావడి స్వయంగా వెల్లడించారు. ఆఫ్రికాలో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ పూర్తయిందని, చిత్ర బృందం భారత్‌కు తిరుగుపయనమైందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాజమౌళి, ఆయన కుమారుడు కార్తికేయతో పాటు ఇతర ప్రతినిధులతో తాను సమావేశమైన ఫొటోలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. కెన్యాలో సినిమా షూటింగ్ జరుపుకోవడంపై మంత్రి ముదావడి హర్షం వ్యక్తం చేశారు. "ప్రపంచంలోని గొప్ప ఫిలిం మేకర్లలో ఒకరైన రాజమౌళికి గత రెండు వారాలుగా కెన్యా వేదికగా నిలిచింది. తన అద్భుతమైన కథనాలతో, విజువల్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన దార్శనికుడు ఆయన" అని ముదావడి తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ప్రశంసించారు. ఆసియాలోనే అతిపెద్ద చిత్ర నిర్మాణ సంస్థ తమ దేశంలో షూటింగ్ జరుపుకోవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. సినిమాకు సంబంధించిన ఆసక్తికర వివరాలను కూడా మంత్రి పంచుకున్నారు. తూర్పు ఆఫ్రికాలోని పలు దేశాల్లో లొకేషన్ల కోసం వెతికిన తర్వాత, రాజమౌళి బృందం కెన్యాను ప్రధాన షూటింగ్ ప్రదేశంగా ఎంచుకుందని ఆయన తెలిపారు. సినిమాలోని ఆఫ్రికా సన్నివేశాల్లో దాదాపు 95 శాతం చిత్రీకరణ తమ దేశంలోనే జరిగిందని స్పష్టం చేశారు. మసాయ్ మారా, నైవాషా, సంబురు, అంబోసెలీ వంటి సుందరమైన ప్రదేశాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు వివరించారు.

ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో విడుదల కానుందని మంత్రి ముదావడి వెల్లడించారు. ఇది సినిమా చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలుస్తుందని, తమ దేశ సౌందర్యాన్ని, ఆతిథ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప అవకాశమని ఆయన అన్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్ర బృందం భారత్‌కు బయలుదేరినట్లు తెలుపుతూ, ఈ సినిమా ద్వారా కెన్యా కథ ప్రపంచానికి తెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656